ప్రజాశక్తి
ఆదివారం అనుబంధం
సెప్టెంబర్ 11, 2016

NAVEEN PRASAD
VISAKHAPATNAM
Cell : 9849070836

నిండు నూరేళ్ల గానం

అలా పాస్..



సినిమాల్లో మహిళా పాత్రలకు ఎంత ప్రాధాన్యత ఉందో తేల్చేందుకు బెచ్‌డెల్ పరీక్ష ఉంది. చాలా సింపుల్‌గా అనిపించే ఆ పరీక్షలో లేడీ ఓరియంటెడ్ చిత్రాలూ అలా పాసవుతున్నాయి. ఇంతకీ బెచ్‌డెల్ టెస్ట్ ఏంటంటే చిత్రంలో కనీసం రెండు పేరున్న స్త్రీ పాత్రలుండాలి. వాళ్లిద్దరి మధ్యా సంభాషణలో పురుష పాత్ర గురించి తప్ప మరే ఇతర విషయాలయినా మాట్లాడుకోవాలి. సినిమాల్లో మహిళా పాత్రకి వెయిటేజ్ పెంచడానికి ప్రముఖ రచయిత అలీసన్ బెచ్‌డెల్ తన కామిక్‌ల ద్వారా ప్రవేశ పెట్టిన ఫార్ములా ఇది. ఈ మధ్య కాలంలో తెలుగులో వచ్చిన లేడీ ఓరియంటెడ్ చిత్రాలన్నీ అనుష్క, అంజలి పాటిల్, భూమిక, జెనీలియ, చార్మి వంటి తారలకి గుర్తింపునిచ్చినా బెచ్‌డెల్ టెస్ట్‌లో మాత్రం ఏవరేజ్ అనిపించుకున్నాయి. 'మంత్ర'లో చార్మికి రూంమేట్ విన్ని పాత్రతో ఓ సంభాషణ ఉంటుంది. 'అరుంధతి'లో అనుష్కకి జేజమ్మ గురించి వివరించేది చంద్రమ్మ పాత్ర. 'అనసూయ'లో పెంపుడు కూతురు లక్ష్మికి అనసూయ(భూమిక)కి మధ్య జరిగే సంభాషణలు కథను నడిపిస్తాయి. 'నా బంగారు తల్లి'లో అంజలి పాటిల్‌కు పద్మక్క పాత్ర తన గురించి వివరించే సన్నివేశం హైలెట్‌గా నిలిచింది. 'కథ'లో జెనీలియా సుగుణ పాత్రతో కొత్త ప్రాంతం గురించి సంభాషణ ఉంటుంది. నయనతార ప్రధాన పాత్రలో నటించిన 'అనామిక'లో మరో పేరున్న మహిళ పాత్ర, వారి మధ్య సంభాషణ లేకపోవడం, ప్రియమణి ద్విపాత్రాభినయంలో వచ్చిన 'చారులత'లో రెండు పాత్రలూ హీరో గురించే మాట్లాడుకోవడంతో బెచ్‌డెల్ టెస్ట్‌లో విఫలమయ్యాయి.

నాలుగు దశాబ్దాలు అగ్నితో పోరాటం. అగ్నికీలల నుంచి బాధితులను రక్షించాలనే ఆరాటం. వెరసి 59 సంవత్సరాల వయస్సున్న బిపిన్ గణాత్రా నిలువెత్తు ఆదర్శం. కోల్‌కతాలో స్వచ్ఛంద ఫైర్ ఫైటర్‌గా నలభై ఏళ్లుగా సేవలందిస్తున్నారు బిపిన్. చిన్నతనంలో జరిగిన ఓ విషాద ఘటన కదిలించి ఆయన జీవితానికి ఒక ఆశయాన్ని ఏర్పరచింది. దీపావళి రోజున తన తమ్ముని ప్రాణాలు మంటల్లో కలిసిపోవడంతో అగ్ని ప్రమాదాలపై రగిలిపోయాడు. తమ్ముడిని కాపాడుకోలేకున్నా మరో ప్రాణాన్ని అగ్నికీలల్లోంచి బయట పడేయాలనే దృఢ సంకల్పంతో అగ్ని మాపక దళంతో చేయి కలిపాడు.



స్వచ్ఛంద ఫైర్ ఫైటర్

నిస్వార్థంతో స్వచ్ఛందంగా చేసిన పనిలోనే ఆయన సంతృప్తిని అనుభవిస్తుంటాడు. తన తమ్ముని జ్ఞాపకాలను నెమరు వేసుకుంటాడు. ఈ ఆశయం కోసం ఆయన తన ప్రాణాలను సైతం పణంగా పెడతాడు. బిపిన్ తన చిన్నతనంలోనే చదువుకు స్వస్తి పలికాడు. తన తమ్ముని ప్రాణాలు పోయిన రోజునే ఆయన తీసుకున్న నిర్ణయానికి నాలుగు దశాబ్దాల వయస్సు వచ్చేసింది. అప్పుడెలా తెగువతో మంటల్లోకి ఉరికి బాధితుల్ని బయటపడేశాడో ఇప్పుడు 59 ఏళ్ల వయస్సులోను అలానే అగ్ని ప్రమాద స్థలాలకు పరుగులు తీస్తుంటాడు. తన ఆశయ సాధనలో ప్రజానీకానికి ఒక సరికొత్త సందేశాన్ని అందిస్తున్నాడు. ఆయన ప్రొఫెషనల్ ఫైర్‌మ్యాన్ కాదు. వందల సంఖ్యలో అగ్ని ప్రమాదాల బారి నుంచి ఎంతో మందిని రక్షించిన ఆపన్న హస్తుడు. కోల్‌కతాలో ఆయన గురించి తెలియని వారుండరు.

24/7 సేవ..

ఒక చిన్న కుటీరంలో జీవిస్తున్నాడు. నగరంలో ఎక్కడైనా అగ్ని ప్రమాదం జరిగిందా అని నిత్యం రేడియోలోనూ, టివిలోనూ వార్తలు వింటూ ఉంటాడు. అర్థరాత్రుళ్లు అయినా సరే అగ్ని ప్రమాదం అంటే చాలు బద్ధకించడం కానీ, భయపడటం కానీ అసలు ఉండదు. అలాగే ఫైర్ స్టేషన్ ప్రధాన కార్యాలయానికి తనే ఫోన్ చేసి తాజా వార్తలు తెలుసుకుంటాడు. ఆయన అగ్ని ప్రమాదం వార్త తెలియగానే, మొదటగా ఫైర్ స్టేషన్‌కి ఫోను చేసి సమాచారమందిస్తాడు. ట్యాక్సీని పురమాయించుకుని సంఘటనా స్థలానికి చేరుకుంటాడు. ఫైరింజన్ రాకముందే, ఘటన జరిగిన మార్గంలో వేచి ఉంటాడు. ఫైరింజన్ వాహనం రాగానే వాహనానికి ముందు పరిగెడుతూ దారి చూపిస్తాడు. ఒక్క క్షణం కూడా వృథా కాకూడదు. సమయం ఎంతో విలువైనదో చిన్నతనంలోని దుర్ఘటన నుంచి తెలుసుకున్నాడు. దారిలో వాహనానికి ఎటువంటి ఆటంకం లేకుండా చేస్తాడు. అందువల్ల సంఘటన స్థలానికి వాహనం త్వరితగతిన చేరుకుంటుంది. ఫైర్ సిబ్బందికి అవసరమైన సహాయ సహకారాలు అందిస్తాడు. అలాగే అగ్ని కీలలను తుదముట్టించే తతంగాన్ని వారి నుంచి చాలా నేర్చుకున్నాడు.

బిపిన్ ఒకే రోజు మూడు అగ్ని ప్రమాద ఘటనల్లో బాధితులను రక్షించడంలో చాలా కీలక పాత్రను పోషించాడు. అంకిత భావంతో పనిచేసే బిపిన్‌కు 2009లో అగ్ని మాపక శాఖ మెటాలిక్ గుర్తింపు కార్డునిచ్చి సత్కరించింది.

కోల్‌కతా నగరంలో చాలా ఎక్కువగా అగ్ని ప్రమాదాలు సంభవిస్తుంటాయి. 2015లో మొత్తం 1,600 అగ్ని ప్రమాదాలు సంభవించగా, అందులో 143 మంది మరణించారు. 974 మంది తీవ్రంగా గాయపడ్డారు. 1993లో బౌవ్ బజారు బాంబు పేలుళ్ల ఘటనలోనూ, 2008లో వంద గంటల నందరామ్ మార్కెట్‌లో అగ్ని ప్రమాద ఘటనలోనూ బిపిన్ స్వచ్ఛందంగా సహాయ సహకారాలనందిం చాడు. అగ్నికీలల బారిన పడి అనేకమార్లు గాయాలపాలయ్యాడు. ఈ ప్రమాదాలేమి ఆపలేకుండా పోయాయి. ఆయన తన పోరాటంలో 21 సంవత్సరాల క్రితం నాటి యూనిఫారమ్ (దీన్ని అగ్ని మాపక శాఖవారు బహుమతిగా ఇచ్చారు) ని ధరించే ఉంటాడు. ఆయన తన వెంట ఒక టార్చిలైటును పెట్టుకుంటాడు. అది కూడా ఆయన స్నేహితులు ఇచ్చినదే. బిపిన్ ఎలక్ట్రీషియన్‌గా నెలకు కేవలం రూ.1000లు మాత్రమే సంపాదిస్తున్నాడు. ఆయన సేవాతత్పరతను గుర్తించిన ఆయన స్నేహితులు ప్రతి నెలా రూ.2,500ల సాయమం దిస్తారు. ఆత్మీయానురాగాలను ప్రేమించే బిపిన్ అంటే అక్కడ స్థానికులకు ఎంతో అభిమానం.

– పద్మా సతీష్

ఇండెక్స్

విజేత.................3
పేదింటి సాకర్ స్టార్

స్టార్.......4
శ్రీ అని మనసారా..!

కార్టూన్ పంచ్......... 5

వింత లోకం...........10
నిలువెత్తు శ్మశానం

ప్రత్యేకం...............11
జైల్లో ఓ రోజు

కవిత్వమ్...............14
ఊపిరి కొనల మీద

నిండు నూరేళ్ల గానం

అట్టమీది కథ...6

సందర్భం - 12
పారాలింపిక్స్ పోరు

వినూత్నం...................15
పింక్ ఆటోస్

కథ 16
మనీషా

తెలుసా......................19
భూమికి గొడుగు

రుచి.........................21
మిర్చి కుర్మా

బాల నేస్తాలు............23
నాలుగేళ్లు మూడు రికార్డులు

పద వికాసం.....
....24

ట్రాక్‌లోకి ఎప్పుడు

28-8-2016 స్నేహలో ప్రచురించిన ట్రాక్‌లోకి ఎప్పుడు? కవర్ స్టోరీ బాగుంది. తెలుగమ్మాయి బిందు మాధవి గురించి ఎన్నో విషయాలు తెలిశాయి. గీతా టాండన్ యూత్‌కి స్ఫూర్తిగా నిలిచారు. స్నేహ హస్తం కథ బాగుంది. వరిచేను పరిచేనులో పంటలన్నీ వినూత్నంగా ఉన్నాయి.

-నీలిమ సుబ్బిసెట్టి, రాజానగరం

అశ్వం అందం

ఒత్తైన జుట్టుతో అందమైన అశ్వాలుగా ప్రపంచ ఖ్యాతి పొందిన బ్లాక్ బ్యూటీ, గోల్డెన్ అఖాల్ టెకె, సగ్రైయా ముస్టాంగ్‌ల చిత్రాలు కళ్లుతిప్పనీకుండా చేశాయి. సమాజంలో ఉండే అపోహలు, ఆచారాలని పక్కనపెట్టి ఆపదలో ఉన్న వారికి సాయపడాలని తెలిపే స్నేహ హస్తం కథ ఆకట్టుకుంది. పిల్లల్లో సృజనాత్మకత, వికాసం కోసం వారిలో అంతర్గతంగా దాగున్న శక్తులని వెలికితీసే లక్ష్యంతో సంతోష్ దిగంబర్ స్టడీ మాల్స్‌ని ఏర్పాటు చేయడం అభినందనీయం. చిమ్మచీకట్లో విందే కాదు రెస్టారెంట్‌లో 45 నిమిషాల పాటు కస్టమర్స్‌ని గైడ్‌చేసే వారు అంధులనే అనుమానం కలగకుండా వారు నడుచుకోవడం నిజంగా హేట్సాఫ్. దొంగ పోలీస్, కత్తులు తినాలనిపించి, అపార్ట్‌మెంట్‌లో



తోట, బతుకు స్టంట్, పల్లెకు వైద్యం చదివించాయి. తారలు ఇష్టపడే దేశాల్లో మమ్మల్ని కూడా విహరించేలా చేసిన తారా విహారం, ఆవకాయ్ అమ్మాయ్ బాగున్నాయి.

-మంజులత, అన్నవరం

బతుకు స్టంట్

టివి సీరియల్ షకీరాతో స్టంట్ ఉమన్‌గా పరిచయమైన గీతా టాండన్ బాలీవుడ్ స్థాయికి ఎదగడం అభినందనీయం. ఆమె జీవితంలో ప్రతిబంధకాలుగా మారిన విషయాలు కళ్లను చెమర్చాయి. తెలుగు తార బిందు మాధవి విశేషాలు, అతిపిన్న తబలా ప్లేయర్ తృప్తిరాజ్ ఆకట్టుకున్నాయి. రియోలో రెండు పతకాలు సాధించడంతో పాటు జాతీయ క్రీడ హాకీలో భారత్ క్రీడాభిమానుల అంచనాలను అందుకోలేకపోవడం విచారకరం. కొబ్బరి తీరం, అపార్ట్‌మెంట్ తోట, చీకటి బిడ్డలు కవిత, వియత్నాంలోని వరిచేను చిత్రాలు అలరించాయి.

- వెంకటేష్ కుమార్, విజయవాడ

స్నేహ హస్తం

స్నేహ హస్తం కథ ప్రధానంగా సొంత ఇల్లు సమస్యను ముందుకు తెచ్చింది. 'మనకు సొంత ఇల్లు ఏర్పాటు చేసుకుందాం' అనిసంయుక్త భర్త మొదటి నుంచి చెబుతున్నా ఆయన చనిపోయిన తర్వాత అద్దె ఇల్లు యజమానురాలు శవంతో రానీయకపోవడం, తను పిల్లలతో హోటల్ రూమ్‌లో వుండడం వల్ల భర్త ఆలోచన తనకి అర్థమయ్యింది. స్నేహశీలి, సొంత ఇల్లు వున్న వాడు కాబట్టి మధుబాబు సంయుక్తకు తన ఇంట్లో వుండమని భార్యతో సహా స్నేహ హస్తం ఇచ్చాడు. మనిషికి అత్యవసరమైన గూడు గురించి రచయిత చక్కగా చెప్పారు. పల్లెకు వైద్యంలో గడ్చిరోలి గ్రామంలో ఐదుగురు పిల్లల తల్లి రాయ్ భాయ్ డాక్టరు రాణి భంగ్ గారికి చెప్పిన మాట ' నేను ఒక రోజు పని మానుకుంటే ఆ పూట పొయ్యి వెలిగే పరిస్థితి లేదు' అని వివరించడం 70 సంవత్సరాల స్వతంత్ర భారతావనికి వివరించినట్టు వుంది.

- ఇలిపిళ్ల సూర్యనారాయణ, విజయవాడ

సంచికపై మీ అభిప్రాయాలను పంపాల్సిన చిరునామా: స్నేహ, ప్రజాశక్తి, డోర్ నెం: 27-30-4, ఆకుల వారి వీధి, గవర్నర్ పేట, విజయవాడ.-520002.
మెయిల్ అడ్రస్ : snehaweekly.praja@gmail.com

పేదింటి సాకర్ స్టార్

రియో ఒలింపిక్స్‌లో పతకాలు సాధించిన క్రీడాకారుల గురించి ఒకటే చర్చ. అంత వరకు ఓ క్రీడాకారిణి జీవితం వెళ్లాలంటే పోటీల్లో ప్రత్యర్థినే కాదు అంతకు ముందు ఎన్నో అడ్డంకుల్ని గెలవాలి. పేదరికం, నిర్లక్ష్యం, చిన్నచూపు, చదువు, కుటుంబ, సామాజిక పరిస్థితులు ఇలా ఎన్నో ఆటంకాల్ని అధిగమించాలి. ఆ ప్రయత్నంలోనే ఉంది ఓ పేదింటి సాకర్ స్టార్ సోనీ కుమారి. జీవితాన్ని డ్రిబుల్ చేసుకుంటూ అండర్-14 భారత్ ఫుట్‌బాల్ జట్టుకి సారథ్యం వహించే వరకు వెళ్లిందీ విజేత కథ.

బీహార్‌లోని చంపారన్ ప్రాంతంలో ఒక దళిత కుటుంబంలో జన్మించింది సోని కమారి. నర్కతియా గంజ్ పట్టణంలో తండ్రి పన్నాలాల్ పాశ్వాన్ టాంగా నడపడం ద్వారా వచ్చే డబ్బే ఆ కుటుంబానికి జీవనాధారం. కటిక పేదరికంలో ఉన్న ఆ కుటుంబ పోషణకు తండ్రి సంపాదన ఏమాత్రం సరిపోయేది కాదు. వ్యవసాయ కూలీగా తల్లి బబితా దేవి సంపాదించే డబ్బు కూడా కుటుంబానికి ఒక రోజు కడుపు నింపుకోడానికే సరిపోయేది. ఐదుగురు సంతానంలో చదువుతో పాటు క్రీడల్లోనూ ముందుండేది సోని. ఫుట్‌బాల్ క్రీడపై సోని అభిరుచిని గ్రహించిన తండ్రి ఆమెని ఆ దిశగానే ప్రోత్సహించాడు. ఆర్థిక పరిస్థితులు అడుగడుగునా అడ్డుపడుతున్నా భారత్ ఫుట్ బాల్ టీమ్‌కి ఎంపికవ్వడమే లక్ష్యంగా ముందుకు సాగింది.

ఆ అవకాశం ఇవ్వలేదు

మురికి పట్టిన ఒక పాత టీ షర్ట్‌ని ధరించిన ఒక అమ్మాయి తనకి ఫుట్‌బాల్‌లో శిక్షణ ఇవ్వమంటూ కోరడం ఫుట్ బాల్ కోచ్ సునీల్ వర్మని ఆశ్చర్యపరిచింది. ఆ అమ్మాయిపై నమ్మకం లేకపోయినా ఆమె తండ్రి మరింతగా ప్రాధేయపడడంతో శిక్షణ ఇచ్చేందుకు ఒప్పుకోవాల్సి వచ్చింది. ఎందుకు మొహమాటపడ్డాన అనే అవకాశాన్ని ఆ అమ్మాయి సునీల్ వర్మకు ఇవ్వలేదు. ఇలా.. సోనీ సాకర్ షూస్ కట్టుకుంది. 2010లో సుశీల్ కుమార్ వద్ద శిక్షణ తీసుకోవడం ప్రారంభించింది సోని. అతి తక్కువ కాలంలోనే అక్కడ శిక్షణ తీసుకుంటున్న క్రీడాకారుల్లో మంచి ప్లేయర్‌గా ఎదగడంతో పాటు 2012లో తొమ్మిదో తరగతి చదువుతున్న సోని బాలికల అండర్-14 జట్టుకి ఎంపికైంది. ఆర్థిక సమస్యల కారణంగా ఆకలి వల్ల కడుపు నెప్పితో బాధపడుతున్నా క్రీడని మాత్రం నిర్లక్ష్యం చేయలేదు.

నేపాల్ భూకంపం నుంచి బయటపడి..

గత సంవత్సరం ఏప్రిల్‌లో నేపాల్‌లో చోటుచేసుకున్న భూకంపానికి చుట్టుపక్కల దేశాలన్నీ గగుర్పాటుకి గురయ్యాయి. ఆ సమయంలో నేపాల్‌లో జరిగిన అండర్-14 బాలికల ఫుట్‌బాల్ మ్యాచ్‌లో భారత జట్టు బంగ్లాదేశ్‌పై విజయాన్ని సాధించింది. ఖాట్మండు దశరథ స్టేడియంలోని మూడో ఫ్లోర్‌లో జట్టు సభ్యులందరూ మరుసటి రోజు ఇరాన్‌పై తలపడేందుకు తమ వ్యూహాన్ని సిద్ధం చేసుకుంటున్నారు. ఇంతలో భూకంపం రావడంతో అందర్నీ కిందకి రమ్మంటూ కోచ్ గట్టిగా కేకపెట్టడంతో వాళ్లు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. సోనితో పాటు జట్టు సభ్యులందరూ గ్రౌండ్‌లోకి చేరుకుంటున్న సమయంలో తీవ్రంగా భూమి కంపించడంతో అక్కడున్న పెద్ద పెద్ద హోర్డింగ్‌లన్నీ కుప్ప కూలాయి. పెద్ద పెద్ద శబ్దాల మధ్య చిమ్మ చీకట్లో గుప్పిట ప్రాణాలు పెట్టుకుని ఐదారు గంటల పాటు ఆ గ్రౌండ్‌లోనే గడిపారు ఆ పిల్లలందరూ. అక్కడి ప్రమాదాన్ని తప్పించుకుని రాత్రి ఎనిమిది గంటలకి ఒక హోటల్‌కి చేరుకున్నా అర్ధ రాత్రి మళ్లీ భూకంపం రావడంతో భయంతో రోడ్లపైకి పరుగులుతీశారందరూ.

మరుసటి రోజు భారత వాయు సేన సాయంతో సురక్షితంగా స్వదేశానికి తిరిగొచ్చినా ఆ సంఘటన సోనీని భయానికి గురిచేసింది. ఆట మానుకోమనికుటుంబ సభ్యులు వత్తిడి చేశారు. కుటుంబ సభ్యుల వ్యతిరేకతే కాదు ప్రాణాపాయ పరిస్థితులూ ఆమెపై ఎలాంటి ప్రభావం చూపలేకపోయాయి. బంగ్లాదేశ్‌పై సాధించిన విజయం తనకి మరింత ప్రేరణ నిచ్చింది. ఆకలి పస్తులని అనుభవిస్తూనే కఠోర శ్రమతో ఎన్నో జాతీయ స్థాయి ఫుట్ బాల్ పోటీల్లో విజయం సాధించింది సోని కుమారి. ప్రస్తుతం భారత్ అండర్-14 ఫుట్‌బాల్ జట్టు కెప్టెన్ కూడా వ్యవహరిస్తూ క్రీడా స్ఫూర్తితో ముందడుగేస్తోంది. అదే కాదు అంతర్జాతీయ వేదికలపై కూడా స్ఫూర్తిదాయక ప్రసంగాలిస్తూ పేదింట గొప్ప కలలు పుడతాయని చాటుతోంది. ఇటీవల దళితులపై న్యూయార్క్‌లో తనిచ్చిన సెమినార్‌కి గాను యునిసెఫ్ అవార్డును కూడా అందుకుంది సోని. ఫుట్ బాల్ క్రీడాకారిణిగా భారత్ తరపున ఎన్నో మ్యాచ్‌ల్లో పాల్గొని పతకాలు సాధించడంతో పాటు దేశానికి మంచి పేరు తెచ్చిన ఈ అమ్మాయి ఇప్పటికీ ఆర్థిక సమస్యలతో సతమతమవుతోంది. ఒక చిన్న మట్టి ఇంట్లో నివసిస్తోంది. టార్పాలిన్ పట్టాలతో కట్టుకున్న స్నానాల గది ముందుగా ఎదురొస్తుంది. పేదరికంలో కొట్టుమిట్టాడుతున్నా క్రీడాభిరుచితో ముందుకు సాగుతున్న సోనిలాంటి క్రీడాకారులని ప్రభుత్వం గుర్తించి ప్రోత్సహించాల్సిన అవసరముంది.



\- శర్వాణి

విజేత

శ్రీ అని మనసారా..!

స్టార్

శ్రీదివ్య హైదరాబాద్‌కు చెందిన అమ్మాయి. తెలుగు సంప్రదాయాలను గౌరవించే కుటుంబంలో జన్మించింది. ఈమెను ముద్దుగా శ్రీ అని పిలుచుకుంటారు. ఆ ముద్దు పేరే ఇండస్ట్రీలో కూడా కొనసాగుతోంది. ఈ పేరుతో తమిళ చిత్రంలో ఎక్కువమందికి ఈమె పరిచయం. ఇప్పటి వరకూ దివ్య చేసిన చిత్రాలు 15.

- శ్రీదివ్య, శ్రీ రమ్య ఇద్దరు హీరోయిన్లూ అక్కాచెల్లెళ్లు. శ్రీదివ్యకు చిన్నప్పటి నుంచే నటన రంగం అంటే ఇష్టం. తన మూడేళ్ల ప్రాయంలోనే బుల్లి తెరపై మెరిసింది. అప్పట్లోనే మంచి పేరు తెచ్చుకుంది.
- మొదట సారిగా 2010లో వెండితెరపై అడుగుపెట్టింది. ఆ చిత్రమే 'మనసారా'. ఈ చిత్రానికి ముందే శ్రీదివ్య 'హనుమాన్ జంక్షన్' చిత్రంలో చైల్డ్ ఆర్టిస్టుగా చేసింది. వీటితో పాటు యువరాజు, వీడే సినిమాల్లో కూడా ఈమె బాల నటిగా మెప్పించింది.
- హీరోయిన్‌గా చేసిన ఆమె మొదట సినిమా మంచి విజయం సాధించింది. రవిబాబు దర్శకత్వంలో వచ్చిన 'మనసారా' చిత్రంలో ఆమె అంజలి పాత్రలో ఒదిగిపోయింది. అంధ చిన్నారులకు పాఠాలు బోధించే వ్యక్తిగా చక్కగా చేసింది. మొదటి చిత్రంతోనే ఆమెకు చిత్రసీమ నుంచి కుప్పులు తెప్పలుగా ప్రశంసలు లభించాయి.
- మారుతి దర్శకత్వంలో వచ్చిన 'బస్‌స్టాప్' చిత్రంలో దివ్య హీరో ప్రిన్స్ సరసన చేసింది. సైలజ పాత్రలో చేసిన ఈ సినిమా కూడా బాక్సాఫీస్ వద్ద మంచి ఫలితాలే సాధించింది.
- తర్వాత ఏడాది 'మల్లెల తీరంలో సిరిమల్లెపువ్వు'లో లక్ష్మీగా మెప్పించింది. ఇందులో ఒంటరి తనంతో బాధపడే మహిళగా భలే చేసింది. కథ పరంగా సినిమాలో దమ్ములేకపోవడం వల్లనో ఏమో గానీ సినిమా అనుకున్న స్థాయిలో ప్రేక్షకాదరణ పొందకపోయినా దివ్య తన నటనతో మెప్పించింది. ఇందులో ఆమె లుక్స్ చాలా చార్మింగ్‌గా కనిపిస్తాయి.
- మొదట సారిగా తమిళంలో శివకార్తికేయన్ సరసన కథానాయికగా చేసింది. ఆ చిత్రమే 'వరుతపడత వలిబార్ సంఘం'. ఆ సినిమాలో శ్రీదివ్య నటనకు బెస్ట్ డెబ్యూ నటిగా సైమా అవార్డు లభించింది. తమిళ ప్రేక్షకులు ఈమె నటనకు ఫిదా అయిపోయారు.

శ్రీ..'మనసారా' పిలుచుకునే ముద్దు పేరు. శ్రీ దివ్య అసలు పేరు. పదహారణాల తెలుగమ్మాయి. పేరుకు తగ్గట్టే ఈమె నటన చూస్తే ముచ్చటేస్తుంటుంది. ఎందుకంటే ఆమెకు చిన్నప్పటి నుంచీ నటన అంటే ప్రాణం మరి. ఇష్టమైన రంగంలో ఏదైనా చేయమంటే మనకంటే ఎవరూ చేయలేరన్నట్టుగా గొప్పగా చేయడానికి ప్రయత్నిస్తాం కదా. అలాగే ఈమెకు ఏ పాత్ర ఇచ్చినా అలవోకగా చేసేయగలదు. ప్రేక్షకులను మెప్పించగలదు. దివ్య వెండితెరపై కనిపిస్తే మన పక్కింటి అమ్మాయి అనేభావన కలగకమానదు. బాలనటిగా, కథానాయికగా ఇప్పటికే చాలా మంది అభిమానులను సంపాదించుకుంది దివ్య. నటనకు ప్రాధాన్యమున్న పాత్రలనే ఎంపిక చేసుకుంటూ తెలుగు, తమిళ చిత్రాల్లో నటిస్తోంది.

- 'వరుతపడత వలిబార్ సంఘం' చిత్రం తర్వాత ఆఫర్లు బాగా పెరిగాయి. తర్వాత రెండేళ్ల పాటు వరుసగా తమిళ సినిమాల్లో చేస్తూ వచ్చింది. 2014, 2015లో రెండేసి చిత్రాల చొప్పున చేసుకుంటూ వచ్చింది.
- 2015 నుంచి తెలుగులో రెండు చిత్రాలు చేసింది. అందులో వారధి, కేరింత. వారధి చిత్రం ఫలితం ఎలా ఉన్నా 'కేరింత' కాస్త పర్వాలేదనపించింది. ఈ సినిమా తర్వాత తెలుగు చిత్రసీమకు దూరమైంది. గత ఏడాదంతా తమిళ చిత్రాలతో బిజీ అయిపోయింది.
- తమిళంలో మూడు సినిమాల్లో కథానాయికగా చేసింది. ప్రస్తుతం ఆమె చేతిలో మరో మూడు తమిళ్ చిత్రాలు ఉన్నాయి. కాష్మోరా, సంగిలి బుంగలి కధవ తొరయ్, మావీరన్ కిట్టు ఈ మూడు చిత్రాలూ ప్రస్తుతం చిత్రీకరణ జరుపుకుంటున్నాయి. శ్రీదివ్య బాలీవుడ్ చిత్రాల్లో నటించే ప్రయత్నాలు చేస్తున్నారు.
- శ్రీదివ్య ఏ సినిమాలో కథానాయికగా చేసినా వల్గారిటీ ఉన్న పాత్రల్లో నటించేందుకు మాత్రం ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వడం లేదనే చేసిన పాత్రలను బట్టి తెలుస్తోంది. ముఖ్యంగా ఈమె అచ్చం తెలుగమ్మాయిలా ఎక్కువగా కనిపించడానికి అవకాశమున్నా పాత్రలనే ఎంపిక చేసుకుంటుంది.

- కొప్పుసెట్టి దేవరాజు

కార్టూన్ పంచ్





నవ్వుల్ - పువ్వుల్

నాన్న పేరు



టీచర్: శ్యామ్ మీ నాన్నగారి పేరు ఇంగ్లిష్‌లో రాసి ఆ ఫారం ఇటు తీసుకురా

శ్యామ్: టెంపుల్ స్టెప్స్ వాటర్ కింగ్

టీచర్: మీ నాన్న గారి పేరు రాయమంటే ఇలా పిచ్చి పిచ్చిగా రాసుకొచ్చావేంట్రా. తమాషాగా ఉందా

శ్యామ్: లేదు సార్! మా నాన్న పేరు గుడిమెట్ల గంగరాజు

బాకీ

రమేష్: బాకీ అడుగుదామని కాల్ చేస్తే రవిగాడు లిఫ్ట్ చేయట్లేదురా!

వెంగళప్ప: నీ సెల్ ఇటివ్వు! నేను చేస్తే గుర్తుపట్టడు...

జిరాక్స్ కాఫీ..!

రామ్: బేరర్ ఒక కాఫీ తీస్కురా..!

బేరర్: 50.రూ సార్..!

రామ్: అంత ఖరీదేంటి? ఎదురు షాపులో 50పైసలని బోర్డ్ పెట్టాడు.

బేరర్: అది జిరాక్స్ కాపీ షాప్ అండీ కాఫీ కాదు.

ప్రాచీన జంతువు

టీచర్: భూమిపై ఉండే జంతువుల్లో అతి ప్రాచీనమైనదేది?

స్టూడెంట్: జీబ్రా

టీచర్: ఎలా?

స్టూడెంట్: ఇంకా అది బ్లాక్ అండ్ వైట్‌లోనే ఉంది.

టీచర్ : ఆ..!

దూరం



టీచర్: రేపు సూర్యుడి మీద పాఠం చెప్తా అందరూ మిస్సవకుండా రావాలి.

పింకి: సారీ టీచర్! మా నాన్న అంత దూరం పంపించడు.

నిండు నూరేళ్ళ గానం

భారతీయ సంగీతాన్ని ఎం.ఎస్.కు ముందు, ఆ తరువాత అంతర్జాతీయంగా వెలిగింపజేసిన వారెందరో ఉన్నారు. పండిట్ రవిశంకర, విలాయత్‌ఖాన్, అల్లారఖా, అంజాద్ అలీఖాన్, హరిప్రసాద్ చౌరసియా, రవికుమార్ శర్మ, ఉస్తాద్ బిస్మిల్లాఖాన్, డి.కె.పట్టమ్మాళ్, ఎం.ఎల్.వసంతకుమారి వంటి వారు చాలా మంది ఉన్నారు. కానీ వీరంతా సాధించిన సంగీత విజయాలు, ఆర్జించిన కీర్తి ప్రతిష్టలను మించిన ఉన్నత శిఖరాలను అధిరోహించిన భారతీయ సంగీత శిఖరం ఎం.ఎస్.సుబ్బులక్ష్మి. ఆమెకు ఈ సెప్టెంబర్ 16కు నూరేళ్లు. ఎం.ఎస్. శతజయంతి సందర్భంగా ఆ అమర గాయని జీవితంలో కొన్ని ప్రధాన, ఆసక్తికర విషయాలు, వివరాలు ఈ వారం అట్టమీది కథలో మీ కోసం.

- హెచ్.రమేష్‌బాబు,
94409 25814

అంధత్వం, చెవుడు, మూగతనాన్ని జయించి విశ్వవిఖ్యాతి గాంచిన అమెరికా మహిళ హెలెన్ కెల్లర్. 1950ల్లో ఆమె భారతదేశం సందర్శించినపుడు ఒకసారి ఢిల్లీలో ఎం.ఎస్.ను కలుసుకున్నది. అప్పుడు హెలెన్ కెల్లర్ "మీ గురించి నేను చాలా విన్నాను. నా కోసం ఒక పాట పాడి వినిపించగలరా?" అనడిగింది. ఈ సంఘటనని మాలినీ శేషాద్రి మాటల్లో 'ఆ సుమధుర సంగీతంతో గది అంతా నిండగా హెలెన్ కెల్లర్ గాయని (ఎం.ఎస్.) తంత్రుల ప్రకంపనలు గ్రహించడానికి గొంతుక మీద తన నాజూకైన వేళ్లను ఉంచింది. అంధురాలూ, బధిరురాలూ అయిన ఆమె ఎం.ఎస్. సంగీతాన్ని ఆ విధంగా ఆస్వాదించింది. పాట పూర్తయిన తరువాత హెలెన్ కెల్లర్ సంతృప్తికరమైన ఒక నిట్టూర్పు విడుస్తూ.. 'నువ్వెంత సుందరమైన సంగీతాన్ని సృష్టిస్తున్నావు' అన్నది ప్రశంసగా.' అని ఆనాటి విశేషాన్ని వివరించారు. కళాప్రేమికులు, కవులు, సంగీత కళా స్రష్టలనే గాదు ఈ ప్రపంచాన్ని చూడలేని, శబ్దాల సడిని వినలేని, వాక్కును పలుకలేని వారిని సైతం రసజగత్తులో తేలియాడించగల స్వర సామ్రాజ్ఞి ఎం.ఎస్. సుబ్బులక్ష్మి.

1963 ఎడింబరో.. అంతర్జాతీయ సంగీతోత్సవాల వేదిక. ఎందరో విశ్వఖ్యాతి గాంచిన సంగీతజ్ఞులతో నిండి వుంది. ఆ వేదికపై అప్పుడే ఎం.ఎస్.సుబ్బులక్ష్మి గాత్ర కచేరీ ముగిసింది. తన్మయభావనతో అందరి కళ్ళలోనూ ఓ స్వచ్ఛమైన వెలుగు కనబడుతోంది. ఆమె తదనంతరం మరో సుప్రసిద్ధ సంగీత సమ్మేళనంగా చెప్పుకొనబడే జుబిన్ మెహతా కచేరీ చేయాలి. ఆయన కనీసం 150 వాయిద్యాలతో వేదికను అలంకరించి కచేరీ చేస్తారు. వాస్తవానికి ఆయన ప్రపంచంలోని గొప్ప సంగీతకారుల్లో ప్రసిద్ధులు. కానీ ఆ రోజు వేదికనెక్కడానికి సంకోచిస్తున్నారు. కారణం తన ఒకే ఒక్క స్వరంతో వేలాది మంది సంగీతాభిమానులను పారవశ్యంలో తేలియాడించిన ఎం.ఎస్. ప్రతిభావ్యుత్పత్తుల ముందు తన వందలాది వాద్య సమ్మేళనం ఏ పాటిదిగా నిలుస్తుందనే సంశయం. ఏమైతేనేం అనే భావనతో భక్తి వినయాలతో జుబిన్‌మెహతా.. వేదిక దిగిన ఎం.ఎస్. ముందు నిలిచి చేతులు జోడించి ఆశీర్వచనలందుకుని వేదికనెక్కారు. అది ఎం.ఎస్. సుబ్బులక్ష్మి సంగీత ప్రాభవం. ఏడు దశాబ్దాలపాటు తన అద్భుత గాన కౌశలంతో కర్ణాటక సంగీతాన్ని చకచ్చకితం చేసిన ఎం.ఎస్.సుబ్బులక్ష్మి సంగీత స్వరయాత్ర భారతీయ శాస్త్రీయ సంగీత ప్రపంచంలో ఓ సువర్ణాధ్యాయం. సుప్రసిద్ధ సంగీత శాస్త్రజ్ఞుడు వి.కె. నారాయణ మీనన్ ఎం.ఎస్. గురించి ఇలా రాస్తారు 'సంగీతంలో ఇంతకన్నా గొప్పవారూ, గౌరవనీయులూ ఇప్పుడూ ఉన్నారు. ఇంతకుముందూ ఉన్నారు. అది వేరే సంగతి. సంప్రదాయ సంగీతకారుని ఆకర్షణ కొద్దిమందికే పరిమితమవుతుంది. అధికాంశం ప్రజలు వారికి దూరంగా ఉండిపోవచ్చు. అటు ప్రజాదరణ పొందిన వారి కచేరీలో ఇసుక వేస్తే రాలకుండా జనం హాజరవచ్చు. కాని అలాంటి వారిని విద్వాంసులు ఏవగించుకోవచ్చు. అయితే సుబ్బులక్ష్మి ఖ్యాతి ఇటువంటి సంగీతపుటెల్లల్ని చెరిపివేసింది' అని. ఆమె నిశితమైన ప్రమాణాలు కోరే మైలాపూర్ (మదరాసు) సభికుల్ని సంతృప్తి పరచగలదు. సామాన్య ప్రజలను

ఉర్రూతలూగించగలదు. 70 ఏళ్ల నాడు సావిత్రి, మీరా శకుంతల చిత్రాల్లో ఎం.ఎస్. పాడిన పాటలు ఆనాటి సినిమా సంగీతాభిమానులకు ఈ నాటికీ అపురూపమైన సంపద వంటివే. తన కర్ణాటక సంగీతమే గొప్పదను కోకుండా ఆమె నారాయణరావు వ్యాస్ వద్ద హిందుస్థానీ సంగీతాన్ని, సిద్ధేశ్వరీదేవి వద్ద 'టప్పా ఠుమ్రీ', దిలీప్‌రాయ్ వద్ద రబీంద్ర సంగీతాన్ని భక్తి సంగీతాన్ని నేర్చుకున్నారు. వైవిధ్యాలున్న ఎన్నో సంగీత బాణీలను అవగతం చేసుకోవడం వల్ల పండిత పామరులను సమాంతరంగా అలరిస్తూ ప్రపంచవ్యాప్తంగా కచేరీలు చేసారామె.

రాగాల లోగిలిలో..

మధురైలోని దేవదాసీ సంగీత కుటుంబంలో 1916 సెప్టెంబర్ 16న జన్మించిన సుబ్బులక్ష్మి అసలు పేరు కుంజమ్మ. అమ్మమ్మ అక్కమ్మాళ్ వయోలిన్ వాద్యకారులు. తల్లి 'షణ్ముక వడివేర్' వీణా వాదన, తరచూ ఇంట్లో జరిగే సంగీత చర్చలు ఆమెను కళా ప్రపంచంలోకి తీసుకువచ్చాయి. ఆరో తరగతిలో తప్పు చేసిందని ఉపాధ్యాయుడు తీవ్రంగా దండించడంతో బడికెళ్ళడం మానుకొని సంగీతాన్ని సర్వస్వంగా ఎంచుకున్నారామె. ముసిరి సుబ్రహ్మణ్య అయ్యర్, సెమ్మంగుడి శ్రీనివాస అయ్యర్ వంటి దిగ్గజాల వద్ద శిక్షణ పొందిన ఎం.ఎస్. తన 12వ ఏట తల్లితో కలిసి వేదికనెక్కి పాడినపుడు కర్ణాటక సంగీతాకాశంలో ఓ కొత్త తారక వెలసినట్లయింది.

స్వరం సవరించి..

మద్రాస్ మ్యూజిక్ అకాడమీ వేదికపై 1932లో ఒకనాడు ప్రఖ్యాత అరియక్కుడి రామానుజ అయ్యర్ కచేరీ చేయవలసి ఉంది. కానీ అనుకోని కారణాల వల్ల హాజరు కాలేని ఆయన సభా నిర్వాహకులకు ఓ లేఖ రాస్తూ నా స్థానంలో ఈ ఎం.ఎస్ పాడుతుందని పంపారు. అప్పటికి పదహారేళ్ళ వయస్సున్న ఎం.ఎస్‌ను



చూసి సభలోని వారంతా నిరుత్సాహపడ్డారు. 'ఈ అమ్మాయి ఏం పాడుతుందని' గుసగుసలాడుకున్నారు. కానీ ఎం.ఎస్ వేదికనెక్కి కచేరీకి సిద్ధమైంది. తన స్వరంతో కోమల గంధర్వ గాన సౌరభాన్ని రవళించేలా పాడింది. ఎదురుగా సంగీత ప్రపంచాన శివయ్యార్ చెంబై వైద్యనాథ భాగవతారు వంటి వారు ఆసీనులై ఉన్నారు. ఎం.ఎస్ నిర్భయంగా తన కచేరీని ముగించింది. అందరి ముఖాల్లోనూ రసానందడోలిక ఊగిసలాడింది. అంత చిన్న వయస్సులో మ్యూజిక్ అకాడమీ వేదికపై పాడే అవకాశం రావడం, పాడి అందరి ప్రశంసలు అందుకున్న వారు అరుదు. అందరి నోటా పొగడ్తలే 'అమ్మడూ నీ కంఠంలో వీణాతంత్రులు మ్రోగుతున్నాయి' అని హాజరైన వారు ఆశీర్వదించారు.

వేల కచేరీలు..

1970ల్లో ఒక సంగీతం విమర్శకుడు ఎం.ఎస్.సుబ్బులక్ష్మిని 'మీరిప్పటి వరకు ఎన్ని

కచేరీలు చేసి ఉంటారు?' అని ప్రశ్నించాడు. అందుకామె చిరునవ్వుతో అన్నది కదా 'మనం దేవాలయానికి ఎన్నిసార్లు వెళ్లి ఉంటామో గుర్తు ఉంటుందా? ఇది కూడా అట్లానే' అని. ఈ జవాబులో ఎం.ఎస్. తన సంగీత సాధనను ఎంత పవిత్రంగా భావిస్తుందో మనకు తేటతెల్లమవుతుంది. ఏడు దశాబ్దాల కాలంలో తమిళ, కన్నడ, తెలుగు, మలయాళ, హిందీ, మరాఠీ వంటి పది భాషల్లో సుబ్బులక్ష్మి చేసిన కచేరీల సంఖ్య రెండు వేల పై చిలుకే ఉంటుంది. వాటిలో స్వలాభం కోసం చేసినవి పాతికశాతం కూడా ఉండవు. మిగతా కచేరీలన్నీ ప్రజా సంక్షేమం కోసం సేకరించే నిధుల కోసం చేసినవే. ఇలా సేకరించిన సొమ్ము కోట్ల రూపాయల్లోనే ఉంటుంది. స్వంతంగా సంపాదించినది కూడా దాన ధర్మాలకు, విరాళాలకు వినియోగించారామె. ఇంకా భర్త వెలువరించే 'కల్కి' పత్రిక నిర్వహణ కూడా దాన ధర్మాలకు, విరాళాలకు వినియోగించారామె.

తోడు.. నీడ..

ప్రతి పురుషుడి విజయం వెనుక ఓ స్త్రీ ఉందనేది ఓ నానుడి. అలాగే ఓ స్త్రీ విజయం వెనుక ఒక పురుషుడుంటాడనే విషయం ఎం.ఎస్. విషయంలో నిజమైంది. ఆయన భర్త త్యాగరాజన్ సదాశివం. ఆయన ఎం.ఎస్.కి స్నేహితుడు. మార్గదర్శకుడు. ఒక ఫిలాసఫర్ కూడాను. సదాశివంకు ఎం.ఎస్‌తో పరిచయం 1936 జూన్ 10న జరిగింది. అప్పటికే ఆయన 'ఆనంద వికటన్' పత్రిక విలేకరిగా పేరొంది ఉన్నారు. 1934లో మ్యూజిక్ అకాడమి వేదికపై కచేరీ చేసి ఎం.ఎస్ సృష్టించిన సంచలనం ఆయనను ప్రభావితం చేసింది. ఆ తరువాత ఎం.ఎస్ తల్లి వద్దకు వెళ్ళి తాను మంచి కచేరీలు ఏర్పాటు చేసి ప్రచారంలోకి తీసుకు వస్తానని మాట ఇచ్చారు. ఆ ప్రకారంగా 1940 నాటికి ఎం.ఎస్.కు దక్షిణ భారతంలో గొప్ప శాస్త్రీయ

ఆలాపన దృశ్యం కడితే..

సుబ్బులక్ష్మి పాడుతుంటే ఆమె వదనంలో ప్రశాంతత, ప్రసన్నత లాస్యం చేస్తుంటాయి. రాగాలాపన, కీర్తన, నెరవు, స్వరకల్పన, ఏదైనా సరే అవి నాద సౌందర్యంతో నిండి ఉంటాయి. కర్ణాటక సంగీతంలో తలమానికమైన 'పల్లవి'ని పాడటంతో తల్లి ఆమెకు ప్రత్యేక శిక్షణనిప్పించారు. అందుకు ఆమెకు మృదంగ సంబంధమైన లెక్కలన్నీ తెలుసు. పల్లవి పాడటమంటే పాండిత్య ప్రకర్షతో కూడిన పని. నిర్దిష్టమైన లయ జ్ఞానం, ధారణ శక్తి, గణిత శాస్త్ర సూక్ష్మాలు ఇవన్నీ కలిగి ఉండాలి. ఇవన్నీ ఆమెలో పుష్కలంగా ఉండటం వల్లనే సాధ్యమైనది. ఆకాశవాణికి చెందిన ఒక సౌండ్ ఇంజనీరు ఎం.ఎస్. ఇతర సంగీత విద్వాంసుల కచేరీల ధ్వని స్వభావాన్ని పరీక్షలు జరిపి చూశాడు. ఒక్క ఎం.ఎస్. విషయంలోనే ఆరంభ శ్లోకం 'గణేశ స్తుతి' నుంచీ చివరి మంగళం 'పవమాన సుతుడు ఒట్టు' వరకు మూడు గంటల సేపూ భారతీయ సంగీతమైన ఆయువుపట్టు అనబడే శృతి లేశమాత్రం చెదరకపోవడాన్ని ఆయన గుర్తించారు. ఈ విషయాలు చెప్పిందెవరంటే సుప్రసిద్ధ కర్ణాటక సంగీత విమర్శకుడైన సుబ్బుడు. సాధారణంగా ఆయన ఎవరి ప్రతిభనైనా అంత అవలీలగా అంగీకరించడు. అంతటి విద్వాంసుడిని మెప్పించిన విద్వన్మణి సుబ్బులక్ష్మి.

అవార్డులు.. రివార్డులు..

ఎం.ఎస్.సుబ్బులక్ష్మి తన సంగీత యాత్రలో ఆరు దశాబ్దాల పాటు ఎం.ఎస్. అందుకున్న పురస్కారాలు, సత్కారాలు అసంఖ్యాకం. పాతికేళ్ళ వయసు నాటికి ప్రఖ్యాత 'ఇసైవాణి' (1940) అవార్డు అందుకున్నారామె. 'పద్మభూషణ్' బిరుదును 1954లో అందుకున్న ఎమ్మెస్ 1956లో కేంద్ర సంగీత నాటక అకాడమి అవార్డును, రాష్ట్రపతి పతకాన్ని, 1967లో రవీంద్రభారతి విశ్వవిద్యాలయం వారి గౌరవ డాక్టరేటుతోపాటు 1968లో మద్రాసు మ్యూజిక్ అకాడమి 'సంగీత కళానిధి' బిరుదుని పొందిన తొలి సంగీత విద్వన్మణి అయ్యారు. ఈ నేపథ్యంలో ఎం.ఎస్. 'ఇసై పేరింజ్ఞర్ (1970), శ్రీ వెంకటేశ్వర వర్సిటీ గౌరవ డాక్టరేటు, 'రామన్ మెగసెస్' అవార్డు, సంగీత నాటక అకాడమి ఫెలోషిప్ (1974) సంగీత సార్వభౌమి, 'పద్మభూషణ్', టిటిడి సప్తగిరి సంగీత విద్వన్మణి బిరుదం (1975) మధ్యప్రదేశ్ వర్సిటీ డాక్టరేట్ ఆఫ్ లెటర్ (1980), అంతర్జాతీయ సంగీత సంఘంలో గౌరవ సభ్యత్వం, శాంతినికేతన్ దేశికోత్తమ అవార్డు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్వాంసురాలిగా నియామకం (1981), మద్రాస్ యూనివర్సిటీ డి.లిట్ (1987) ఇందిరాగాంధీ నేషనల్ చాంబర్ ఆఫ్ ఆర్ట్స్‌కి ట్రస్టీగా నియామకం, "కాళిదాస్ సమ్మాన్ (1988), ఇందిరాగాంధీ జాతీయ సమైక్యతా అవార్డు (1990), 'కోణార్క్ సమ్మాన్' (1991) గుప్తా ఫౌండేషన్ అవార్డు (1996) స్వరాలయ అవార్డు (1997), సంగీత సాగర్ అవార్డు (1998) ఐటిసి వారి సంగీత అవార్డు, కేంద్ర ప్రభుత్వం జీవిత సాఫల్య పురస్కారాలు (2004) ఎం.ఎస్‌ను వరించి తమ గౌరవాన్ని పెంచుకున్నవి. భారత ప్రభుత్వ అత్యున్నత పురస్కారం భారతరత్నను1998లో ఆమె అందుకున్నారు.

గాయనిగా విశేష ఆదరణ దక్కేలా చేశారు. జర్నలిస్టు కావడంతో తనకున్న పరిచయాలతో గాంధీ, నెహ్రూ, రాజాజీలకు పరిచయం చేశారు. ఇవన్నీ ఎం.ఎస్. కెరియర్‌కు దోహదపడినవి. ఈ క్రమంలో సదాశివంతో సాన్నిహిత్యం 1940 జూలై 10 నాటికి వివాహంగా పరిణమించింది. అయితే, సదాశివం అప్పటికే వివాహితుడు. ఇవేమీ వారి పెళ్ళికి నాటి పరిస్థితులలో అవరోధం కాలేదు. వివాహానంతరం సదాశివం పూర్తిగా ఎం.ఎస్ సంగీత కార్యక్రమాల ఏర్పాటుకు పరిమితమైనారు. ఇక్కడి నుండి ఆమె పాడిన ఒక్కొక్క కచేరీ కీర్తి శిఖరాలను చేరే ఒక్కో సోపానంగా ఆయన తీర్చిదిద్దారు. ప్రచారానికి సంబంధించిన కిటుకులన్నీ ఆయనకు తెలుసు. వాస్తవానికి ఎం.ఎస్. పుట్టింది కళావంతుల కుటుంబంలోనే. అయినా, సదాశివంతో పెళ్లైన తర్వాత ఆమె ఆ ముద్రను పూర్తిగా చెరిపేసుకున్నారు. ఎమ్మెస్ సుబ్బులక్ష్మి – సదాశివంల జంటను నాడు ప్రముఖులెందరో 'సావిత్రి – సత్యవంతుల'తో పోల్చారు. రాజాజీ గారైతే 'మీ ఇద్దరిని చూస్తే.. ఎవరు సావిత్రో, ఎవరు సత్యవంతులో తెలియడం లేదు.. మీరిద్దరి మధ్య ఉన్న అనురాగం అలాంటిది' అన్నారొక సందర్భంలో. మంగళంపల్లి వారైతే 'మాలాంటి వారము ఏకంగా ప్రజల్లోకి వెళ్లలేము. ఎవరో ఒకరు మీడియేటర్ కావాలి. కానీ సుబ్బులక్ష్మి గారికి ఆ ఇబ్బంది లేదు. అందుకు సదాశివం గారున్నారు' అన్నారు.

56 ఏళ్లపాటు తోడు, నీడగా గురువుగా ముందుండి నడిపించిన సదాశివం 1997లో మరణించారు. భర్త మృతి ఆమెను ఒంటరిగా మిగిల్చింది. వారికి సంతానం లేదు. సదాశివం తొలిభార్య సంతానాన్ని ఆమె పెంచారు.

ఎం.ఎస్. మైనపు బొమ్మ

సదాశివం మృతి తరువాత ఆమె మళ్ళీ పాడేందుకు తంబూరానైనా తాకలేదు. ఆమె పాడాలని, పాడితే వినాలని దేశవ్యాప్తంగా ఉన్న ఆమె సంగీతాభిమానులు ఆశించారు. కానీ ఆమె పాడకుండానే 2004 డిసెంబర్ 11న తన జీవనయానాన్ని చాలించారు.



భర్త సదాశివంతో

వెండితెరపై మీరాగా..

సంగీత విదుషీమణిగా సంగీత వేదికలపై జైత్రయాత్ర చేసిన ఎం.ఎస్. సుబ్బులక్ష్మి అయిదు సినిమాల్లో నటించారు. ఆమె నటించిన చిత్రాల్లో చాలా మందికి 'మీరా' (1944) సినిమా మాత్రమే తెలుసు. ఆమె తొలి చిత్రం 'సేవాసదన్' 1938లో వచ్చింది. తమిళ సినిమాను తొలినాట పెంచి పోషించిన కె.సుబ్రహ్మణ్యం

గాంధీ, నెహ్రూ మెచ్చిన గాత్రం

1947లో గాంధీజీ నుండి సదాశివంకి ఓ కబురు వచ్చింది. అదేమిటంటే ఎమ్మెస్ నోట 'హరి తుమ్ హరో' పాటను వినాలని ఉందని. అయితే ఆ పాట ఆమెకు రాదని తిరుగు సమాచారం పంపగా, గాంధీజీ 'ఈ పాట ఎమ్మెస్ నోట మాటల్లో చదివినా చాలు ఆమె పాడాలని' మళ్ళీ కబురు పంపారు. ఆయన కోరిక మేరకు పాడి ప్రత్యేకంగా రికార్డు చేసి పంపారు. సరిగ్గా ఆ రోజు 1947, అక్టోబర్ 2న అలా ఆ పాట గాంధీజీకి జన్మదిన కానుకైంది. ఆ తరువాత 1948 జనవరిలో మహాత్ముని మరణ వార్త ప్రసారం చేసిన ఆకాశవాణి వారు వెంటనే ఎం.ఎస్. ఆయన కోసం గానం చేసిన 'హరి తుమ్ హరో'ను ప్రసారం చేశారు. ఇది విన్న సుబ్బులక్ష్మి భావోద్వేగానికి లోనై స్పృహ తప్పిపడిపోయారు. తొలి ప్రధాని నెహ్రూ ఎం.ఎస్. పాట విన్న తరువాత 'నేనొక మామూలు ప్రధాన మంత్రిని మాత్రమే ఈ సంగీత సామ్రాజ్ఞి ముందు నేనెంత' అన్నారు. ఆమె నటించిన 'మీరా' చిత్రం చూసిన సరోజినీ నాయుడు నా నైటింగేల్ బిరుదును ఈమెకు ఇచ్చేశానన్నారు. 'తప్పిపోయిన నా ఆత్మను తిరిగి కనుగొన్నాను.' అని పండిత గోవింద వల్లభ్ పంత్ ప్రశంసించారు. ఉస్తాద్ బడే గులాం అలీఖాన్ ఎం.ఎస్. గానం విని 'బేటీ ఖూబ్ ఖావో ఖూబ్ గావో' అని అభినందించారు. ఆమెకే గురువైన సెమ్మంగుడి వారైతే ఓ సందర్భంలో 'ఈమెను పొగిడేందుకు నా వద్ద మాటలు లేవ'న్నారు.

'ప్రేమ్‌చంద్' కథ ఆధారంగా 'ఆనంద వికటన్'లో వచ్చిన ధారావాహిక ఆధారంగా 'సేవాసదన్' తీశారు. ఈ చిత్రంలో బ్రాహ్మణ కుటుంబాల్లోని మూఢ విశ్వాసాలను, కట్నకానుకల దురాచారాలను బయటకీడ్చారు. ఈ చిత్రంలో ఎం.ఎస్. పాడిన అద్భుతమైన రెండు పాటలున్నాయి. నారాయణరావు వ్యాస్ వద్ద నేర్చుకున్న హిందుస్థానీ పాట 'శ్యామసుందర మదన మోహన' అనేది 'నీదు చరణ పంకజములు' అనేవి బాగా పాపులరైనాయి. 'శకుంతల' (1940) చిత్రం సినీ చరిత్రలో ఒక క్లాసిక్‌గా



నిలిచిపోయింది. జి.ఎన్. బాలసుబ్రహ్మణ్యం దుష్యంతుడుగా, సుబ్బులక్ష్మి శకుంతలగా, ఎల్.వి.ఆర్. డంకన్ దర్శకత్వంలో వచ్చిన ఈ చిత్రం గోల్డెన్ జూబ్లీ చేసుకుంది. పురుషుడి చేత మోసానికి గురైన స్త్రీలా ఎం.ఎస్.నటన అద్భుతం. అనన్య సామాన్యం. నీలినీలి మేఘాలను వెదుక్కుంటూ ఆకాశంలో ఎగిరిపోయే విహంగంలా ఎం.ఎస్. స్వరమాధుర్యం ఈ సినిమాలో తారాస్థాయిని అందుకుంది.

సుబ్బులక్ష్మి నటన 'మీరా' చిత్రంలో హిమాలయ శృంగాన్ని అందుకున్నది. ప్రతిక్షణం గానవాహినిలో కొట్టుకుపోయే మీరా పాత్రలో ఆమె నిజంగా జీవించింది. సరోజినీ నాయుడు ఈ సినిమా మొదట్లో 'భారత కోకిల' అన్న తన బిరుదును ఎమ్మెస్‌కు ఇచ్చేస్తున్నానంటూ ఆమెను ప్రేక్షకులకు పరిచయం చేస్తారు. ఈ చిత్రంలో మీరా భర్తగా చిత్తూరు నాగయ్యగారు నటించడం విశేషం. మీరా తమిళ వెర్షన్ 1944లో వస్తే హిందీ వెర్షన్ 1947లో వచ్చింది.

మీరా చిత్రంలో

తెలుగు దర్శకుడు వై.వి.రావు తీసిన 'సావిత్రి' (1941)లో సుబ్బులక్ష్మి నారద పాత్రను పోషించింది. భారతీయ సినీ చరిత్రలో నారద పాత్రను పోషించి మెప్పించిన ఏకైక నటీమణి ఆమె అనే విషయం ఆశ్చర్యం కలిగించకమానదు. ఈ చిత్రంలో ఆమె 'బృహి ముకుందేతి' అనే పాట ఆ రోజుల్లో బహుళ జనాదరణ పొందింది. కలకత్తా స్టూడియోలో సావిత్రి రికార్డింగ్ జరిగేటప్పుడు కె.ఎల్.సైగల్, కానన్‌దేవి, పన్నాలాల్ ఘోష్, దిలీప్‌కుమార్ రాయ్ వంటి సీనియర్ సంగీత ప్రముఖులు ఎం.ఎస్. సుబ్బులక్ష్మితో మరీ మరీ పాడించుకుని ఆనందించేవారు.

మీరా చిత్రంలో..

'సావిత్రి' చిత్రంలో ('సునో సునో బన్‌కి రాణి' అనే పాటలో) నాటికే ప్రఖ్యాతురాలైన శాంతా ఆప్టే సావిత్రిగా నటించింది. ఇద్దరు వేర్వేరు సంగీత బాణీలకు చెందిన గాయనీమణులు నటించారీ చిత్రంలో. ఎం.ఎస్. కోసం సదాశివం స్వయంగా 'శకుంతల', 'మీరా' చిత్రాలు నిర్మించారు. భౌతికంగా ఎమ్మెస్ మన మధ్య లేరు. కానీ ఆమె గాత్రం వెంటాడే నేపథ్యగీతంలా సంగీత భారతరత్నంగా నిరంతరం మనతోడై సాగుతూనే ఉంటుంది. ✦

ఆమె మెప్పుకోలు

ఎం.ఎస్. ఒకసారి తిరువనంతపురంలో తన భర్త సదాశివంతో కలిసి ఆచార్య ఆర్.శ్రీనివాసన్ ఇంటికి అతిథులుగా వెళ్లారు. వాగ్గేయకారునిగా, సంగీత విమర్శకునిగా 1920–50ల మధ్య కాలంలో ప్రసిద్ధి చెందారు. ఎం.ఎస్. దంపతులు వచ్చిన సందర్భంగా ఒక ప్రముఖ కళాకారిణి కూడా వచ్చి శ్రీనివాసన్ గారింట్లో బస చేసింది. ఆ రోజు సాయంత్రం ఆమె ఒక అపూర్వమైన కృతిని గానం చేసింది. అంతకుముందెన్నడూ ఆ కృతిని ఎం.ఎస్. విని వుండలేదు. దాంతో ముగ్ధురాలై తనకు ఆ కృతిని నేర్పమని కోరింది. ఆ గాయని అందుకు అంగీకరించి నేర్పింది. ఎం.ఎస్. అనితర సాధ్యమని జ్ఞాపకశక్తి కారణంగా కేవలం రెండు సార్లు పాడగానే ఆ కృతి ఆమెకు దాదాపుగా పూర్తిగా పాడటం వచ్చేసింది. 'దాదాపుగా' అని ఎందుకనాల్సి వచ్చిందంటే ఆ కళాకారిణి లాగా పాట ముగింపును పూర్తి చేయలేకపోయింది ఎం.ఎస్.. ఎన్నిసార్లు ప్రయత్నించినా లాభం లేకపోయింది. తను స్పష్టంగా ఆమెలా పాడలేకపోతున్నానని ఒప్పుకుని 'ఇది ఒక విధమైన మిక్కిలి సున్నితమైన గానం. కొన్ని రకాల కంఠాలకే తగుతుంది. ఈ పాట మీ గొంతుకే అంత అందంగా పలుకుతుంది. నా గొంతుక అలా చేయలేదు. అందువల్ల నేను పాటలో అంతిమ 'ఘట్టం' వదిలివేసి నా పద్ధతిలో పాడతాను' అన్నది ఎం.ఎస్. అలా ఇతరుల ఘనతను కూడా మెచ్చుకునే ఉన్నతమైన వ్యక్తిత్వం ఆమెది.



నిలువెత్తు శ్మశానం

శ్మశానాలకు స్థలాలు లేకపోవడంతో ఆరడుగుల లోతున కాకుండా ఆరేడు అంతస్తుల్లో సమాధుల్ని కడుతున్నారు చాలా చోట్ల. వీటన్నింటిలోకి అతి ఎత్తయినది బ్రెజిల్‌లోని సాంటోస్ నగరంలో ఉంది. మెమోరియల్ నెక్రోపోల్ ఎక్యుమెనికాగా పిలుస్తున్న 32 అంతస్తుల ఈ స్మశానం ఎత్తు 108 మీటర్లు. ఒక్కో అంతస్తులో 150 వరకు సమాధి స్థలాలుంటాయి. వాటిలో ఒక్కో దాంట్లో 6 వరకు భౌతిక కాయాల్ని ఉంచొచ్చు. మూడేళ్లలో డీకంపోజ్ అయిపోయాక వేరే చోటకు మారుస్తారు. 1983లో ఓ సాధారణ భవంతిగానే ఉన్నా రాను రాను చోటు లేక నిలువెత్తున సమాధుల్ని నిర్మించుకుంటూ పోయారు. పెపె ఆల్ట్‌స్టట్ ఆనే పెద్దాయనకు ఇలా అంతస్తుల రూపంలో కట్టాలనే ఆలోచన వచ్చింది. ప్రస్తుతానికి పాతిక వేల సమాధులకు తోడు కొన్ని విశ్రాంత గదులు, ఓ ప్రార్థనా మందిరం, మసోలియమ్‌లు, పీకాక్ గార్డెన్‌తోపాటుగా ఓ చిన్న జలపాతాన్ని కూడా ఏర్పాటు చేశారు. ఓ రెస్టారెంట్‌ను కూడా నిర్వహిస్తున్నారు. నిర్మాణ రీతిలో విలక్షణంగా కనిపించే ఈ నిలువెత్తు స్మశానం అనుకోకుండా పర్యాటక కేంద్రం కూడా అయిపోయింది. సాంటోస్‌కు వచ్చిన పర్యాటకులు కచ్చితంగా దీన్ని సందర్శిస్తారట.

వింత లోకం

పుస్తకం తిరిగివ్వకుంటే జైలే..!

గ్రంథాలయానికి వెళతారు. పుస్తకం తెచ్చుకుంటారు. చరచరా చదివేస్తారు. కానీ తిరిగి ఇవ్వడం మాత్రం మరచిపోతారు. మరోసారి మరో పుస్తకం తెచ్చుకునే అవకాశం పోతే పర్లేదు కానీ జైలుకు వెళ్లాల్సొస్తేనే ఆలోచించాల్సింది. అలబామాలోని ఏథెన్స్-లైమ్‌స్టోన్ గ్రంథాలయం నిర్వాహకులు అదే మాట గట్టిగా చెబుతున్నారు. సుమారు కోటీ ఇరవై లక్షల రూపాయలకు పైగా విలువ చేసే పుస్తకాలు పత్తా లేకుండా పోయాయట. తీసుకున్న వాళ్లు తిరిగివ్వడం లేదట. అందుకే 5 వేల రూపాయల జరిమానా, 30 రోజుల జైలు శిక్ష వేయిస్తే పద్ధతి మారుతుందని నిర్వాహకులు అంటున్నారు. అదీ చివరి అస్త్రంగానే ప్రయోగిస్తారట. ఎందుకొచ్చిన చిక్కులు పుస్తకాన్ని అల్మారాలో చెదలు పట్టించే బదులు తిరిగిచ్చేస్తే పోలా..!

145 ఏళ్లు దాటి..

ఎక్కువ కాలం బతికిన వ్యక్తిగా ఫ్రెంచి మహిళ జీన్ కాల్మెంట్ పేరిట రికార్డుంది. ఆమె 122 ఏళ్లు హ్యాపీగా బతికేసింది. ఆమె రికార్డును దాటిపోయింది జావాలోని ఓ తాత వయస్సు. ఇండోనేషియాకు చెందిన మ్బాహ్ గోతో 1870 డిసెంబర్ 31న పుట్టాడని అధికారిక పత్రాలు కూడా ఉన్నాయి. రెండో ప్రపంచ యుద్ధమపుడు ఆయనకు 74 ఏళ్లు. మనం సాధారణంగా 'తాతా! స్వాతంత్ర్యం వచ్చేపుడు బడికి వెళ్లే వయస్సుంటుందా నీకు' అని అడుగుతాం. అప్పటికే ముసలాడీ తాత. భార్యతోపాటు పిల్లలు కూడా చనిపోయారు. నలుగురిని వివాహమాడిన మ్బాహ్ చివరి భార్య 1988లోనే మరణించింది. ప్రస్తుతం మనవళ్లు, మునివళ్లు వాళ్ల పిల్లలతో కాలక్షేపం చేస్తున్నాడు.

జైల్లో ఓ రోజు ఎలా ఉంటుందనే ఆసక్తి చాలా మందికి ఉంటుంది. ఖైదీ జీవితమేంటో సినిమాల్లో చూసి ఉంటారు. ఎవరి మాటల్లోనో విని ఉంటారు. పుస్తకాల్లో చదివి ఉంటారు. కానీ స్వయంగా దానిలో గడిపి తెలుసుకుంటే? అందుకు నేరాలు చేయక్కర్లేదు. జైల్లో ప్రత్యక్ష అనుభవాన్ని కలిగించేందుకు సంగారెడ్డి జైలు నిర్వాహకులు అవకాశం కల్పిస్తున్నారు.

జైల్లో ఓ రోజు

మ్యూజియంగా మార్చిన ఈ జైల్లో 'ఖైదీ' ఆతిథ్యం.. దుస్తులు, పాత్రలు, ఇనుప చువ్వలు, తోట పనితోనే కలిపి ఉంటుంది. లాడ్జిలో ఓ రూమ్ బుక్ చేసుకున్నట్లు ఇక్కడ ఓ సెల్‌ను ఓ రోజు అద్దెకు తీసుకోవచ్చు. ఖైదీలా ఓ రోజు బతకొచ్చు. జైళ్లపై ఉండే అపోహలు, రకరకాల ఆలోచనలకు వాస్తవానికి ఉండే వైరుధ్యాన్ని సామాన్య ప్రజలకు తెలియజెప్పేందుకు జైళ్ల శాఖ ఈ సరికొత్త ఆతిథ్యాన్ని అందిస్తోంది. పక్కాగా జైలు నియమ, నిబంధనలు పాటిస్తూ ఈ ఖైదీ అతిథి పాత్రలో మీరు ఒదిగిపోవాలనుకుంటే రూ.500లు కడితే సరి. మీరు జైలు జీవితాన్ని రుచి చూడవచ్చు. తెలంగాణాలోని మెదక్ జిల్లాలో ఉన్న ఈ సెంట్రల్ జైలు పురాతనమైంది. ఇది హైదరాబాద్‌కు సుమారు 70 కిలోమీటర్ల దూరంలో ఉంది. దీన్ని 1796లో నిజాం ప్రభువు నిర్మించారు. 200 ఏళ్ల పాటు పనిచేసిన ఈ చారిత్రాత్మక జైలును ఈ ఏడాది జూన్‌లో మ్యూజియంగా మార్చేశారు. ఈ మ్యూజియానికి అదనపు ఆకర్షణగా ఖైదీ (ఫీల్ ది జైల్-ఎ రియల్ గెస్ట్) కార్యక్రమాన్ని ఆగస్ట్ రెండో వారంలో రూపొందించారు.

ఖైదీలా..

ఇక్కడకొచ్చిన వ్యక్తి ఈ కాన్సెప్ట్‌ననుసరించి నిజంగానే ఖైదీలా చూడబడతాడు. ప్రారంభంలో సబ్బునిస్తారు. ఈ సబ్బు కూడా ఖైదీలు తయారుచేసిందే. ఉదయాన్నే 5 గంటలకు ఇద్దరు సెక్యూరిటీ గార్డులు నిద్ర లేపుతారు. జైలు గదిని శుభ్రపరిచాక ఉదయం 6.30 గంటలకు టీ, 7.30 గంటలకు ఇడ్లీతో అల్పాహారం ఉంటుంది. 10.30 - 11.00 గంటలకు అన్నం, పప్పు, సాంబారుతో మధ్యాహ్న భోజనం.. రాత్రి భోజనం.. మళ్లీ ఒక కూర, అన్నం, పెరుగుతో సాయంత్రం 5 గంటలకు భోజన ఏర్పాట్లుంటాయి. పగటి సమయంలో తోట పని కానీ, పరిసరాలను పరిశుభ్రం చేసే పని కానీ అప్పగిస్తారు. సాయంత్రం ఆరు గంటల తర్వాత సెల్‌లోకి పంపి తాళం వేస్తారు. అన్ని వసతి సౌకర్యాలు అచ్చం ఖైదీకిచ్చినట్లే ఉంటాయి. అల్యూమినియం ప్లేటులో భోజనం, సబ్బు, అల్యూమినియం గ్లాసు, ఒక మగ్గు, అలాగే ఇతర వసతులు జైలు

వాతావరణాన్ని తలపించేవిగా ఉంటాయి. 200 ఏళ్ల క్రితం నిర్మించిన కట్టడం కొంచెం భయానక వాతావరణముంటుంది. ఇద్దరు మాత్రమే గార్డులుంటారు. వారే తోడుగా ఉంటారు. ఇదొక ప్రధాన జైలులానే రాత్రుళ్లు పోలీసు అధికారి తనిఖీకి వస్తుంటారు. కర్ణాటక, ముంబై వంటి సుదూర ప్రాంతాల నుంచి కూడా ఈ ఆతిథ్యం తీసుకునేందుకు ఉత్సాహం చూపుతున్నవారున్నారు. ఒక రోజు ముందుగా నిర్వాహకులకు చెబితే జైలు గదిని కేటాయిస్తారు. సంగారెడ్డి శివార్లలో నిర్మించిన ఈ జైలు 2012లో తిరిగి ప్రారంభించారు. ఈ జైలును కొంత మరమ్మతులు చేసి, తొమ్మిది బరాక్‌లు, 18 జైలు గదులుగా నిర్మించి ఆధునీకరణలతో కొత్త హంగులతో ఈ జైలును మ్యూజియంగా మార్చేశారు. మూడెకరాల విశాల స్థలంలో దీన్ని నిర్మించారు. ఒక ఎకరం విస్తీర్ణంలో మ్యూజియం భవంతి ఏర్పాటు చేశారు. ఈ భవంతిలో పురాతన కాలం నాటి జైలు-ఖైదీల బొమ్మలు, సంకెళ్లు ఇతర వస్తువులతోపాటు అనేక కళాఖండాలు, ఆకృతులు, చిత్రాలు, చక్రవర్తుల జీవిత చరిత్రలు రాసి ఉన్న గోడలు వంటి అంశాలు పర్యాటకులను ఎంతగానో ఆకర్షిస్తున్నాయి. సందర్శకుల తాకిడి ఎక్కువవుతుండటంతో, దీన్ని తెలంగాణా పర్యాటక శాఖ ప్రయాణ సదుపాయాన్ని కూడా కల్పించింది. ఇక్కడే పిల్లలకు ఒక పార్కు, ఒక ఆయుర్వేద గ్రామాన్ని నిర్మించాలని ఆలోచన.

- క.వి.చుసారా

సందర్భం



పా

లాటిన్ అమెరికా పెద్దన్న బ్రెజిల్ మూడువారాల వ్యవధిలో రెండో ఒలింపిక్స్ సంరంభానికి ముస్తాబైంది. ప్రధాన ఒలింపిక్స్‌కు విజయవంతంగా అతిథ్యమిచ్చిన సాంబా ల్యాండ్... సెప్టెంబరు 7 నుంచి 18 వరకూ జరిగే పారాలింపిక్స్‌కు సైతం పూర్తిస్థాయిలో ఏర్పాట్లు చేసింది. భారత్.. 19 మంది సభ్యుల బృందంతో పోటీకి దిగుతోంది.

రియో ఒలింపిక్స్ అనుభూతుల నుంచి క్రీడాభిమానులు పూర్తిగా బయటపడక ముందే... బ్రెజిల్ మరో ఒలింపిక్స్ నిర్వహణకు సమాయత్తమయ్యింది. బుద్ధిమాంద్యం, అంగవైకల్యం, బదిరుల కోసం ప్రత్యేకంగా నిర్వహించే పారాలింపిక్స్‌కు అంతర్జాతీయ పారాలింపిక్ సంఘం నేతృత్వంలో బ్రెజిల్ ఒలింపిక్ సంఘం భారీస్థాయిలో ఏర్పాట్లు చేసింది.

అంతా స్పెషలే..

స్పెషల్ ఒలింపిక్స్‌గా పిలిచే పారాలింపిక్స్ అంతా ప్రత్యేకమే. మానసికంగా, శారీరకంగా పదిరకాల వైకల్యాలు వున్న క్రీడాకారులను మాత్రమే....పారాలింపిక్స్‌లో పాల్గొనటానికి అనుమతి ఇస్తారు. ఈ పోటీల్లో పోరు మనల్ని ఉత్తేజితుల్ని చేస్తుంది. క్రీడాకారుల మనోబలం స్ఫూర్తి రగిలిస్తుంది. ఎందుకంటే వారంతా ప్రత్యేక అవసరాలు, సామర్థ్యాలున్న అసాధారణ క్రీడాకారులు. ఒలింపిక్స్ అనగానే... యుద్ధానికి పూర్తిస్థాయిలో సిద్ధమైన అథ్లెట్లు మాత్రమే గుర్తుకు వస్తారు. అయితే...పలురకాల వైకల్యాలతో పుట్టినవారికి, బాల్యంలో పోలియో వ్యాధి పీడితులు, ప్రమాదాల బారిన పడినవారు, యుద్ధాలలో అంగవైకల్యానికి గురైనవారు లోపాల్ని జయించి క్రీడా పోటీల్లో ఊహాతీతంగా పోరాడతారు. ఒంటి కాలి వెయిట్ లిఫ్టర్లు కనిపిస్తారు. చేతులు లేని విలుకాళ్లను చూస్తారు. రెండు కాళ్లు లేని బ్లేడ్ రన్నర్‌లు దూసుకెళుతుంటారు. బుద్ధి మాంద్యమున్న వారు సింక్రనైజ్ పోటీల్లో ప్రతిభ చాటుతారు. తమలాంటి వారికే కాక సాధారణ వ్యక్తులకు కూడా జీవితాన్ని గెలిచేదెలానో నేర్పిస్తారు. శారీరిక, మానసిక వైకల్యం ఏర్పడినవారిలో ఉత్తేజాన్ని నింపడానికి, ప్రతిభను వెలికి తీయటానికి... అంతర్జాతీయ పారా ఒలింపిక్స్ సంఘం నిర్వహిస్తున్న పోటీలే...స్పెషల్ ఒలింపిక్స్ కమ్ పారాలింపిక్స్.

1960లో తొలిసారిగా..

నాలుగేళ్లకోసారి జరిగే సాధారణ ఒలింపిక్స్‌తో ఏమాత్రం సంబంధం లేకుండా 1960లో మొట్టమొదటిసారి పారాలింపిక్స్ నిర్వహించారు. రెండో ప్రపంచ యుద్ధంలో క్షతగాత్రులుగా మిగిలిన యూరోప్ దేశాల సైనికుల మధ్య నిర్వహించిన పోటీల ద్వారా పారాలింపిక్స్ ఆలోచనకు బీజం పడింది.

1988 సియోల్ ఒలింపిక్స్ నుంచి మాత్రమే సాధారణ ఒలింపిక్స్‌కు అనుబంధంగా పారాలింపిక్ నిర్వహిస్తూ వస్తున్నారు. వేసవి ఒలింపిక్స్‌కు ఆతిథ్యమిచ్చిన వేదికలోనే



పేట్కర్



గిరీశా నాగరాజ్

కరమ్‌జ్యోతి ద

4,500 మంది అథ్లెట్లతో..

ప్రపంచంలోనే అతిపెద్ద సాకర్ వేదిక.. రియో డి జెనిరోలోని మరకానా స్టేడియం వేదికగా సెప్టెంబరు 7 నుంచి 18 వరకూ జరిగే ఈ స్పెషల్ ఒలింపిక్స్‌లో.. 176 దేశాలకు చెందిన 4,500 మంది అథ్లెట్లు పోటీ పడబోతున్నారు.
మొత్తం 23 రకాల క్రీడలకు చెందిన 528 అంశాలలో పోటీలు నిర్వహించబోతున్నారు.

పారాలింపిక్స్
...రు



పారాలింపిక్స్‌ను సైతం నిర్వహించేలా మార్పులు చేశారు. 1960 నుంచి 2012 వరకూ ఎలాంటి అవాంతరాలు లేకుండా జరుగుతూ వస్తున్న పారాలింపిక్స్‌లో భారత్‌కు సైతం 48 సంవత్సరాల చరిత్ర ఉంది. ఇప్పటి వరకూ భారత్ అథ్లెట్లు రెండు స్వర్ణాలతో సహా మొత్తం ఎనిమిది పతకాలు మాత్రమే సాధించారు. ఇందులో మూడేసి రజత, కాంస్య పతకాలు సైతం ఉన్నాయి.

1972లో భారత్‌కు తొలి స్వర్ణం

హీడెల్‌బర్గ్ వేదికగా 1972లో జరిగిన పారాలింపిక్స్‌లో భారత స్విమ్మర్ మురళీకాంత్ పెట్కార్.. 50 మీటర్ల ఫ్రీస్టయిల్ ఈతలో 37.331 సెకన్ల ప్రపంచ రికార్డు టైమింగ్‌తో బంగారు పతకం సాధించారు. పారాలింపిక్స్ చరిత్రలో భారత్‌కు ఇదే తొలి స్వర్ణ పతకం. 1984 పారాలింపిక్స్ పురుషుల షాట్‌పుట్‌లో జోగిందర్ సింగ్ భేడి రజత పతకం అందించారు. జావలిన్, డిస్కస్ త్రో అంశాలలో సైతం కాంస్య పతకాలు సాధించారు.

జావలిన్ త్రోలో భీమ్‌రావ్ కెసార్కర్ రజత పతకం గెలిచి దేశానికే గర్వకారణంగా నిలిచారు. 2004 ఏథెన్స్ పారాలింపిక్స్ జావలిన్ త్రోలో దేవేంద్ర జాజరియా బంగారు పతకం సాధిస్తే... పవర్ లిఫ్టింగ్ 56 కిలోల విభాగంలో రాజేందర్ సింగ్ కాంస్య పతకం గెలుచుకున్నారు. ఇక 2012 లండన్ ఒలింపిక్స్ పురుషుల హై-జంప్‌లో... గిరీశ నాగరాజు గౌడ రజత పతకం సాధించి... భారత పరువు నిలబెట్టారు. గిరీశ పతకం వల్లనే... భారత్ పతకాల పట్టికలో 67వ ర్యాంక్‌లో నిలిచింది. ప్రస్తుత రియో పారాలింపిక్స్‌లో మాత్రం... గతంలో ఎన్నడూ లేనంతగా.. 19 మంది సభ్యుల బృందంతో భారత్ పోటీకి దిగుతోంది. 16 మంది పురుషులు, ముగ్గురు మహిళలతో కూడిన భారత్ అథ్లెట్ల జట్టు.. ఏ మాత్రం అంచనాలు లేకుండా ఐదురకాల క్రీడల్లో మాత్రమే పాల్గొంటుంది. ప్రధాన ఒలింపిక్స్‌లో 118 సభ్యుల భారీ బృందంతో పాల్గొని రెండంటే రెండు పతకాలతో ...67 వ స్థానంలో నిలిచిన భారత్... 19 మంది సభ్యుల జట్టుతో పాల్గొంటున్న పారా అథ్లెట్ల నుంచి పతకాలు ఆశించడం అత్యాశే అవుతుంది.

- చొప్పరపు కృష్ణారావు

(84980-84018)

రియోలో మనోళ్లు

దీపా మాలిక్	షార్ట్‌పుట్ (ఎఫ్ 53)
పూజ	ఆర్చరీ రికర్వ్
కరమ్‌జ్యోతి	డిస్కస్ త్రో (ఎఫ్ 55)
రణ్‌బీర్ నరేందర్	జావెలిన్ త్రో (ఎఫ్ 42/44)
సుయాష్ జాదవ్	స్విమ్మింగ్ (ఎస్ 7)
దేవేంద్ర జజారియా	జావెలిన్ త్రో (ఎఫ్ 46)
అంకుర్ ధామ	1500 మీ. పరుగు (టి 11)
రింకు	జావెలిన్ త్రో (ఎఫ్ 46)
వరుణ్ భాట	హై జంప్ (టి 42)
నరేష్ శర్మ	50 మీ. ఫ్రీ రైఫిల్ 3 పొజిషన్స్
మరియప్పన్ తంగవేలు	హైజంప్ (టి 42)
సుందర్ గుర్జార్	జావెలిన్ త్రో (ఎఫ్ 46)
శరద్ కుమార్	హైజంప్ (టి 42)
ఫర్మాన్ బాషా	పవర్ లిఫ్టింగ్ (49 కేజీ)
రాంపాల్ చాహర్	హై జంప్ (టీ 47)
ధరంబీర్	క్లబ్ త్రో (ఎఫ్ 51)
సందీప్	జావెలిన్ త్రో (ఎఫ్ 44)
అమిత్ సరోహ	క్లబ్ త్రో (ఎఫ్ 51)
వీరేందర్ ధన్కార్	జావెలిన్ త్రో, షాట్ పుట్ (ఎఫ్ 57)

(టీ.. ట్రాక్‌ను, ఎఫ్.. ఫీల్డ్‌ను సూచిస్తే అంకెలు వైకల్యంలోని తీవ్రతను సూచిస్తాయి.)

ఊపిరి కొనల మీద



ఊపిరి కొనల మీద
అగ్ని జ్వాల రగులుతోంది
ఉడికిన కళింగాంధ్ర
జీవితాల మీద
అణు విద్యుత్ కొవ్వాడ
విధ్వంస
దృశ్యమవబోతోంది
మరో దుఖ్ఖానికి
సన్నాహమవుతోంది
 చినుకుల్ని దున్ను కున్నట్లు
ప్రమాదాల్ని మోయలేం
అణు విధ్వాంసాల్ని ఆపలేం
ఒక కలల ప్రపంచానికి
ఒక పవన విద్యుత్ చాలు
ఒక ప్రవహించే నీటి
విద్యుత్ చాలు
నన్ను నేను సౌకర్యవంతం
చేసుకోడానికి
విధ్వంసం అవసరం లేదు.
ఎన్నో వినూత్న మార్గాల
అన్వేషణ జీవులం కదా
మనం....

-గవిడి శ్రీనివాస్
9985010538

కలప చెక్కపై జీవన ముద్ర

ఖాసీ జానపదాల్ని కలప చెక్కల మీద కళ్లకు కడుతున్నాడు సృజనకారుడు ట్రీబర్ మాలాంగ్. ఈశాన్య భారత్‌లోని ఖాసీ-జైల్లింగ్ కొండ కోనల్లో పుట్టి పెరిగిన మాలాంగ్ శాంతి నికేతన్ కళా భవన్ విద్యార్థి. తన స్వస్థలమైన మైరాంగ్‌తోపాటు షిల్లాంగ్‌లోని జన జీవనాన్ని కళా ప్రపంచంలోకి తర్జుమా చేసేందుకు ఆయన ఎంచుకున్న మరో పరికరం ఉడ్ కట్ ఆర్ట్. అమ్మలు చెప్పిన ఖాసీ జానపద కథల్ని, కళల్ని 'యూ మాసావా' ఫేస్‌బుక్ పేజీ పేరిట ప్రచారంలోకి తెచ్చారు. లలిత కళా అకాడెమీ స్కాలర్‌షిప్‌తో పాటు ఇన్‌లాక్స్ ఫైన్ ఆర్ట్స్ అవార్డును దక్కించుకున్నాడు. ఈ నవ కళాకారుడు 'అద్దక్ బడ్‌కీ లోక్ జోంగ్ యూ' అనే కామిక్ బుక్‌లో స్థానిక జీవితాన్ని చిత్రి పట్టాడు. ఉడ్ కట్ ప్రింట్లలో ఒదిగిపోయిన అక్కడి జీవన చిత్రాలివే.







పింక్ ఆటోస్

విస్తరిస్తున్న మహా నగరాల జీవనంతో భార్యభర్తలిరువురూ ఉద్యోగ బాధ్యతలు చేపట్టాల్సి వస్తోంది. ఉద్యోగాలు, చదువుల రీత్యా బయటికెళ్లే మధ్యతరగతి మహిళలకి చాలా శాతం బస్సులు, షేర్ ఆటోలే దిక్కు. రాత్రి సమయాల్లో మహిళలకి ప్రత్యేకమైన రవాణా సదుపాయాలు లేకపోవడంతో మార్గం లేక మహిళలు ఎక్కువగా షేర్ ఆటోల్లో ప్రయాణిస్తుంటారు. 2012లో చోటుచేసుకున్న నిర్భయ ఘటన తర్వాత ఒడిశా జంట నగరాలుగా పరిగణించే భువనేశ్వర్-కటక్‌లోని వివిధ ప్రాంతాల్లో మహిళలపై వరుస దాడులు నమోదయ్యాయి. వాటిని తగ్గించే ప్రయత్నంగా పింక్ ఆటోస్ అనే ఒక కొత్త ఆలోచనని ప్రవేశపెట్టింది భువనేశ్వర్ పోలీస్ యంత్రాంగం. ఆటో తోలేది పురుషులే కదా మరి ఈ ఆటోల ప్రత్యేక ఏంటనే సందేహం రాకమానదు. రాత్రి సమయాల్లోనూ ఆటో నడపాలంటే పోలీసు శాఖ నిర్వహించే కొన్ని పరీక్షల్లో నెగ్గాలి. ఆటో డ్రైవర్‌గా అనుభవంతో పాటు నేరచరిత్ర, వారిపై నమోదయిన మునుపటి కేసులను పరిశీలిస్తారు. వాటి ద్వారా ఎంపిక చేసుకున్న కొందరు ఆటోవాలాలకి కఠినమైన మానసిక పరీక్షలుంటాయి. పోలీసులు ప్రత్యేకమైన టెస్టులని నిర్వహిస్తారు. వీటిలో ఉత్తీర్ణులయితేనే పింక్ ఆటో అనే లేబుల్‌ని అంటించిన ఈ ఆటోలని రోడ్లపై నడిపేందుకు అనుమతిస్తారు. అన్ని ఆటోల్లో వీటిని తేలిగ్గా గుర్తించేందుకే ఈ ప్రత్యేకమైన లేబుల్ విధానాన్ని ప్రవేశపెట్టారు. సురక్షితమైన ప్రయాణమే కాదు ఏదైనా ప్రమాదం జరిగినప్పుడు వెంటనే వైద్యమందించేందుకు ఫస్ట్ ఎయిడ్ బాక్స్ కూడా కలిగుంటాయి ఈ ఆటోలు. ప్రయాణీకుల అభిప్రాయాలను తెలుసుకునేందుకు సజెషన్ బాక్స్‌లు కూడాఈ ఆటోల్లో ఉంటాయి. తొలిసారిగా 270 మంది ఆటోవాలాలకి పరీక్ష నిర్వహించి 200 మందిని ఎంపిక చేసి శిక్షణ అందించారు.

అందరూ ఆటోల్లో ప్రయాణిస్తుంటారు. అయితే మనం ప్రయాణించే సాధారణ ఆటోల కంటే వీటికి కొన్ని ప్రత్యేకతలున్నాయి. మహిళా భద్రతకు ప్రాధాన్యతనిచ్చే 'షీ' ఆటోలు వెలుగులోకి రాక ముందే భువనేశ్వర్‌లో ఈ పింక్ ఆటోలు చక్రాలు మోపాయి. అర్ధరాత్రి సైతం మహిళల ఒంటరి ప్రయాణాలకి రక్షణ కల్పిస్తున్నాయి. మహిళలను వేధించే ఆటోవాలాలు కొందరే ఉన్నా వారి వల్ల మిగతా వాళ్లందరికీ చెడ్డ పేరు వస్తోంది. ఇప్పుడు ఈ పింక్ ఆటో కార్యక్రమం ద్వారా అలాంటి వారి ఆలోచనల్లోను మార్పులు వస్తున్నాయి.

ఈ రకమైన ప్రత్యేక శిక్షణకి తొలుత ఆటోవాలాల నుండి విమర్శలు ఎదురైనా తర్వాత మరి కొందరు శిక్షణ పొందేందుకు ముందుకొచ్చారు. దీంతో పాటు కొన్ని ప్రధాన కూడళ్లను ఎంచుకుని అక్కడ ప్రజా టెలిఫోన్ బూత్‌లను ఏర్పాటు చేశారు. వాటిని స్థానిక పోలీస్ కంట్రోల్ రూమ్‌కి అనుసంధానం చేశారు. మహిళలు ఆపద సమయాల్లో వీటిని వినియోగించడం ద్వారా రక్షణ కల్పించుకోవచ్చు. వారున్న ప్రదేశాన్ని పసిగట్టి త్వరిత గతిన సాయం అందిస్తారు పోలీసులు. ఈ ప్రజా టెలిఫోన్ బూత్‌లు జనసంచారం లేని సమయాల్లో మహిళలకు మానసిక ధైర్యాన్ని అందిస్తున్నాయి.

ఆటోడ్రైవర్ల పనితీరును సమస్యలను తెలుసుకునేందుకు నెలవారి మీటింగ్‌లని నిర్వహిస్తారు. నగరంలో మహిళలపై చోటుచేసుకున్న దాడులల్లోని సున్నిత విషయాల ప్రస్థావన ద్వారా ఆటో వాలాల ఆలోచనా తీరులో మార్పు తేవడానికి కృషిచేస్తున్నారు. దారి మళ్లించి ప్రయాణీకులని గాయపరిచిన కొన్ని సంఘటనలు నమోదవడంతో పింక్ ఆటో గుర్తింపు ఉన్న వాటితో పాటు నగరంలో తిరిగే అన్ని ఆటోల్లోనూ జిపిఎస్ విధానాన్ని ప్రవేశ పెట్టనుంది ఒడిశా పోలీసు యంత్రాంగం. మరింత ఉన్నతంగా పనిచేసేందుకు ఆటో వాలాలకి ఇలాంటి శిక్షణా కార్యక్రమాలు తోడ్పడుతున్నాయి.

ప్రయాణీకులకి మరింత భద్రత కల్పిస్తున్న పింక్ ఆటోలు ప్రస్తుతం ప్రజల మన్ననల్ని అందుకుంటున్నాయి. కాలేజీలు, రైల్వేస్టేషన్లు, కార్యాలయాల వద్ద మహిళలు ప్రస్తుతం ఎలాంటి సందేహం లేకుండా పింక్ ఆటోసేవల్ని వినియోగించుకోవడంతో ఈ ఆటోవాలాల జీవనం కూడా మరింత మెరుగైంది. భువనేశ్వర్ ఆటోవాలాల పనితీరుతో నగరంలో పింక్ ఆటోల సంఖ్య మరింతగా పెరగడం ఒక గొప్ప పరిణామం. భువనేశ్వర్ పింక్ ఆటో కాన్సెప్ట్ మంచి ఫలితాలివ్వడంతో ఒడిశాలోని అన్ని ప్రాంతాల్లో వీటిని ప్రవేశపెట్టేందుకు పోలీసు యంత్రాంగం కృషిచేస్తోంది.

మనీషా

కథ

- శాంతిశ్రీ
8333818985

'ప్రవీణ్! ఒక్కసారి ఇలా రావాలి.. కొంచెం సాయంపట్టు మనూకి షర్ట్ వేయాలి!' అంటూ పిలిచింది మనీషా.

మనోజ్‌ని 'మనూ!' అనే మొదటి నుండి మనీషా పిలుస్తుంటుంది.

ప్రవీణ్, మనీషా పెళ్లయ్యి మూడేళ్లు నిండాయి. వారికో బాబు.

ఇందులో ప్రత్యేకత ఏమీ లేదు. కానీ మనోజ్ మంచి మనస్సు వల్లే వారిద్దరూ ఒక్కటయ్యారు.

'ఆ వస్తున్నా..!' అంటూ ప్రవీణ్ గబగబా వచ్చాడు. మనీషా, ప్రవీణ్ కలిసి మనోజ్‌కు బట్టలు మార్చారు.

వారిద్దరూ తన పట్ల చూపే ఆప్యాయతకు మనోజ్ కళ్ల వెంట రెండు కన్నీటి చుక్కలు అతని తెలియకుండానే రాలి, మనీషా చేతిపై పడ్డాయి.

'ఏంటి మనూ ఏడుస్తున్నావా?' అంటూ మనీషా కంగారుపడిపోయింది.

'ఏంట్రా! ఎందుకు? ఏడుస్తున్నావా?' అని అంతకన్నా ఎక్కువగా ప్రవీణ్ కంగారుగా, మనోజ్‌ని హగ్ చేసుకున్నాడు.

'అబ్బే! ఏంలేదు.. మీరు చూపించే ఆప్యాయతను నా గుండె తట్టుకోలేకపోతోంది రా? గుండెకు ఏది ఎక్కువైనా కష్టమే అనుకుంటా!' వాతావరణాన్ని తేలికపరుస్తూ అన్నాడు మనోజ్.

ప్రవీణ్ ఒక్కసారిగా మౌనంగా ఉండిపోయి, గతంలోకి వెళ్లిపోయాడు..

● ● ●

ప్రవీణ్, మనోజ్ ఇద్దరూ ప్రాణ స్నేహితులు. ప్రవీణ్ అప్పుడప్పుడు మనోజ్ వాళ్లింటికి వచ్చిపోతూ ఉండేవాడు. మనోజ్, మనీషా ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. వారి అనురాగాల పందిరికి రెండు పుష్పాల్లా ఇద్దరు పిల్లలు. హాయిగా సాగిపోతున్న వారి సంసారంలో మనోజ్‌కు జరిగిన యాక్సిడెంట్ పెను తుపాను రేపింది.

ఆ అర్ధరాత్రి వేళ మనీషా ఫోన్ చేసి 'ప్రవీణ్ జీ! మీరు ఎక్కడున్నా అర్జంటుగా రండి. మనోజ్‌కు యాక్సిడెంట్ అయ్యింది. అసలు ఏమీ మాట్లాడటం లేదు. నేనూ, పిల్లలు మాత్రమే ఉన్నాం. నాకు ఏం చేయాలో అర్థంకావడం లేదు..” అంటూ వెక్కి వెక్కి ఏడుస్తూనే ఒక్కోమాటా కూడబలుక్కుని చెప్పింది.

“మీరిప్పుడు ఎక్కడున్నారు?” అన్న మాటలకు మనీషా వైపు నుండి ఎలాంటి స్పందనా లేదు. అప్పటికే మనీషా కూడా కుప్పకూలిపోయింది. ఆ ఫోనుని, పక్కనే నిలుచుని చూస్తున్న జనంలో ఒకరు తీసుకుని మాట్లాడి, వివరాలు చెప్పారు.

ఆ వివరాలకు అనుగుణంగా ప్రవీణ్ తన కారులో ఎంత స్పీడులో వచ్చాడో తెలియదుగానీ, పావుగంటలో అక్కడకు వచ్చేశాడు. వస్తూ వస్తూనే 108కి కాల్ చేశాడు.

ప్రవీణ్ వచ్చేటప్పటికి మనోజ్ రక్తపు

మడుగులో పడిపోయి ఉంటే, ఆ పక్కనే మనీషా కూడా మనోజ్‌ను పిలిచి, పిలిచి అతని చేతిపై పడిపోయి ఉంది. ఆమె ముఖం మీద రక్తం, కన్నీటి మరకలు ఇంకా తేమగా ఉన్నాయి. పిల్లలిద్దరూ గుక్కపెట్టి ఏడుస్తున్నారు. జనం అంతా చుట్టూ చేరి 'అయ్యో.. !' అంటూ కొందరు చూస్తుంటే.. మరికొందరు తమ చేతుల్లో సెల్‌ఫోన్లో.. ఆ దృశ్యాల్ని తీస్తున్నారు.. అంతలా ఏడుస్తున్న పిల్లల్ని మాత్రం ఎవ్వరూ దగ్గరకు తీసుకోలేదు. 'మానవత్వం లేని మనుషుల మధ్య ఉన్నామనడానికి ఇంతకన్నా ఉదాహరణ లేదు.. ఛీ...ఛీ..!!' అనుకుంటూ వారిని పక్కకు తప్పుకోమని, పిల్లలిద్దర్నీ దగ్గరకు తీసుకున్నాడు ప్రవీణ్. మరో పది నిమిషాలకే 108 వాహనం కూడా వచ్చింది. అందులోనే మనోజ్‌ను, మనీషాను స్ట్రెచర్‌పై పడుకోబెట్టి.. తనూ పిల్లల్ని తీసుకుని, కారులో వాహనం వెంట ఆసుపత్రికి వెళ్లారు.

తెల్లారికి మనీషా స్పృహలోకి వచ్చింది.

మనోజ్ సంగతి 48 గంటలు గడిస్తేగానీ ఏమీ చెప్పలేమన్నారు డాక్టర్లు.

మనీషా స్పృహలోకి వచ్చిందన్నమాటేగానీ, కంటికీ మింటికి ఏకధారగా ఏడుస్తూనే ఉంది. "నా మనోజ్ లేని జీవితాన్ని నేనెప్పుడూ ఊహలో కూడా ఊహించలేదు.. నా మనూ లేకపోతే, నేను ఈ క్షణమే చనిపోతా.. మనూ.. మనూ డియర్...!" అంటూ ఏడుస్తూ మళ్లీ మళ్లీ స్పృహ కోల్పోతోంది మనీషా. డాక్టర్లు ఆమెకు సెలైన్ పెట్టి, నిద్రపట్టడానికి ఇంజెక్షన్ ఇవ్వడంతో నిద్రలోకి జారుకుంది మనీషా. పిల్లల్ని పెట్టుకుని డాక్టర్లు ఏం చెప్తారా అని ప్రవీణ్ ఎదురుచూస్తున్నాడు. పిల్లలిద్దర్నీ తెల్లారి ప్రవీణ్ తల్లి పార్వతమ్మ ఆసుపత్రికి వచ్చి, తీసికెళ్లింది. మనోజ్, మనీషా పేరెంట్స్‌కి ప్రవీణ్ కాల్ చేసినా 'మమ్మల్ని వద్దనుకుని పెళ్లి చేసుకున్నారు. ఇప్పటివరకూ మేము అవసరం లేదనే అనుకున్నారు. వాడు ఛస్తే ఎంత? బతికితే ఎంత?' అంటూ మనోజ్ తండ్రి ఫోన్ కట్ చేశాడు. 'అది కులం తక్కువోడిని చేసుకున్న రోజే మేం చచ్చిపోయిందనుకున్నాం. ఇక మాకూ దానికీ ఎలాంటి సంబంధం లేదు' అంటూ ఫోన్ పెట్టేశాడు మనీషా అన్నయ్య.

ఆ 48 గంటలూ 48 యుగాల్లా అనిపించింది ప్రవీణ్‌కు. మనీషా స్పృహలోకి వచ్చినప్పుడల్లా మనఃస్థిమితం లేని ఆమె మాటలకు డాక్టర్లు ఇంజెక్షన్లు ఇచ్చి, నిద్రపుచ్చుతున్నారు. 48 గంటల తర్వాత మనోజ్ గురించి డాక్టర్లంతా చర్చించుకుని, ప్రవీణ్‌ను పిలిచారు. "చూడండి మిస్టర్ ప్రవీణ్! నీ స్నేహితుడికి ప్రాణగండం తప్పినట్టే.. బట్.." అంటూ డాక్టర్ చెప్పడం ఆపారు.. "ప్రాణగండం లేదన్నారుగా? మనోజ్‌కు ఇంకా ప్రాబ్లమ్ ఏంటి డాక్టర్..? ప్లీజ్ చెప్పండి.." అంటూ ప్రవీణ్ డాక్టర్ కాళ్లను తన రెండు చేతులతో పట్టేసుకుని, అప్పటివరకూ అదిమిపెట్టిన దుఃఖం తన్నుకు రావడంతో ఏడ్చేశాడు. ప్రవీణ్ అలా ఏడుస్తుంటే, డాక్టర్ కూడా ఏమీ మాట్లాడకుండా కాసేపు మాట్లాడకుండా అలా మౌనంగా ఉండిపోయారు.

ప్రవీణ్ ఏడుపును కంట్రోల్ చేసుకుని "సారీ డాక్టర్! బాగా ఎమోషన్ అయిపోయాను..!" అంటూ సర్దుకుని, ఛైర్‌లో కూర్చున్నాడు.

డాక్టర్ దగ్గరకు వచ్చి ప్రవీణ్ భుజంపై చేయి వేసి, "నువ్వు నిజంగా బెస్ట్ ఫ్రెండ్‌వే!.. ఏమీలేదు.. నీ ఫ్రెండ్‌కు బాడీలో ఎడమవైపు

"ప్రవీణ్! మనీషా లేకుండా నీతో మాట్లాడదామంటే అసలు కుదరడం లేదు. నేను ఒకటి అడుగుతాను. నువ్వు కాదనకూడదు. నాది అత్యాశేగానీ, నువ్వు తప్ప వేరెవరూ తీర్చలేరు.." అని మనోజ్ బతిమిలాడినట్లే ప్రవీణ్ చేయిని తన కుడిచేత్తో మెల్లగా నొక్కుతూ అడిగాడు.

భాగమంతా ఇక ఎప్పటికీ పనిచేయదు" అని చెప్పగానే. ప్రవీణ్ షాకయ్యాడు. అయినా స్నేహితుడు బతికాడు అంతే చాలు అనుకున్నాడు. మనీషాకు కూడా వారంరోజులు ఆగాక, మెల్ల మెల్లగా విషయం చెప్పారు. మనోజ్ ఇంటికి చేరడానికి నెలపైనే పట్టింది. అప్పటివరకూ వారికి ప్రవీణ్, పార్వతమ్మే అండగా నిలిచారు.

ఇంటికి చేరాక మనీషా మనోజ్‌కి అన్నీ తానే అయి, కంటికి రెప్పలా చూసుకోసాగింది.

"ఏడాది గడిచిపోయింది. నా పరిస్థితిలో ఎలాంటి మార్పూ రావడంలేదు. నా మీద ఎన్నో ఆశలు పెట్టుకుని, తనవాళ్లని కాదనుకుని వచ్చింది. నేనేమి ఇవ్వగలిగాను. నావల్ల ఆమె జీవితం అంతా మోడువారిపోవాల్సిందేనా?" అని మనోజ్ కుమిలిపోయాడు.

రాత్రి పిల్లల్ని నిద్రపుచ్చి, తన పక్కనే మంచం వేసుకుని పడుకున్న మనీషాను దగ్గరకు రమ్మన్నాడు మనోజ్.

"మనీ! నా వల్ల నీ జీవితం ఇలా అయిపోవడం ఏం బాగోలేదు. నీ సంతోషాన్ని అంతా నేను హరించేశాను. నా మాట విని...!" అంటూ ఆగాడు మనోజ్.

"ఆ.. నీ మాట విని.. ఏం చేయాలి మనోజ్?" అంది మనీషా.

ధైర్యం కూడదీసుకుని.. "నువ్వు మరో పెళ్లి చేసుకోకూడదూ..!" అన్నాడు మనోజ్.

అంతే "మనూ..!" అంటూ బిగ్గరగా అరిచినంత పనిచేసి, మనీషా పెద్దగా ఏడ్చేసింది.

"సరే సరే.. నీకు ఇష్టం లేకపోతే వద్దులే... సారీ రా..!" అంటూ మనోజ్ ఒక చేత్తోనే తన గుండెలపై తలపెట్టి రోదిస్తున్న మనీషా తలపై నిమిరాడు.

అలా మనోజ్ ఏదో సందర్భంలో మనీషాని మెల్ల మెల్లగా అడుగుతూనే ఉన్నాడు. మనీషా ప్రతిసారీ నో చెప్పి, ఆ విషయాన్ని దాటవేయడమో, లేదా అక్కడ నుండి ఏదో పని ఉన్నట్లు వెళ్లిపోవడమో చేస్తుండేది.

తనకు వీలుకాకపోతే తప్ప, దాదాపు రోజూ క్రమంతప్పకుండా ప్రవీణ్ వస్తూనే ఉంటాడు. ఇంట్లోకి అవసరమైనవి మనీషాని అడిగి తెచ్చిపెట్టడం, పిల్లల గురించిన మంచి చెడ్డలు చూసుకోవడం అన్నీ తనే చేస్తుండేవాడు. ఏడాది క్రితం తల్లి చనిపోవడంతో ఎక్కువసేపు ప్రవీణ్ మనోజ్‌తోనే గడుపుతున్నాడు.

అంతేకాదు మనోజ్‌ను డాక్టర్ చెకప్‌కు తీసికెళ్లడం కూడా ప్రవీణే.

ఎవరైనా స్పెషలిస్ట్ వస్తే చాలు, మనీషాతో సంప్రదించడం, అపాయింట్‌మెంట్ తీసుకొని, మనోజ్‌ను డాక్టర్‌కు చూపించేవాడు ప్రవీణ్. ఎంత ఆశతో మనీషా, ప్రవీణ్ ఆ డాక్టర్ దగ్గరకు మనోజ్‌ను తీసుకుని వెళ్లేవారో, తిరిగి వచ్చేటప్పుడు చాలా నీరసంగా, నిస్సత్తువగా అయిపోయేవారు. ఆ రోజు రాత్రి ఎవరికీ నిద్రలు ఉండేవి కాదు.

ఇలా చాలాసార్లు వెళ్లి వెళ్లి ఒకసారి ప్రవీణ్ వచ్చినప్పుడు "ప్రవీణ్! ఇక ఈ ప్రయత్నాలు మానుకోండి. డాక్టర్లు అంతా పరిస్థితిలో మార్పేమీ రాదన్నాక, నా గురించి వృథా ప్రయాసపడకు. మనీషాకి కూడా లేనిపోని ఆశలు రేకెత్తించకు.. వెళ్లేటప్పుడు ఎంత ఉత్సాహంగా ఉంటుందో, తిరిగి వచ్చాక చాలా బాధపడుతుంది. తనని ఆ స్థితిలో చూసి, నేను తట్టుకోలేకపోతున్నా. ప్లీజ్!" అన్నాడు మనోజ్.

"అరేయ్ ఇదేంట్రా..?! ఎవరైనా మంచి డాక్టర్ దొరికితే, నిన్ను మునుపటిలాగా చూడాలనే ఆశతో తప్ప, నిన్నూ, మనీషాని బాధపెట్టాలని కాదురా..! సరే.. ఇక తీసికెళ్లనులే.. రెగ్యులర్ చెకప్‌కే వెళ్దాం...! ఓకేనా..!!" అంటూ మనోజ్‌కు నచ్చజెప్పాడు ప్రవీణ్.

మనోజ్ చేసే బిజినెస్ మొత్తం కూడా ఆన్‌లైన్‌లో ఇప్పుడు అతని సమక్షంలో మనీషానే దాదాపు చూసుకుంటుంది. అప్పుడప్పుడు ప్రవీణ్ కూడా కొన్ని మెలకువలు నేర్పుతున్నాడు. పెళ్లయిన కొత్తల్లో మనీషా కూడా మనోజ్‌తో ఆఫీసుకు వెళ్లేది. పిల్లలు పుట్టాక వారిని

చూసుకోవడానికే ఎక్కువ సమయం కేటాయించింది. దాంతో మనోజే మొత్తం చూసుకునేవాడు.

చూస్తూ ఉండగానే ఏడేళ్ళు గిర్రున తిరిగిపోయాయి. ఈ ఏడేళ్లూ మనోజ్‌కు నిద్రలేని రాత్రులు ఎన్నో... నిద్రపోయిన రాత్రులనే లెక్కపెట్టుకోవచ్చుమో. ఒకరోజు మనీషా బయటకు వెళ్లినప్పుడు ప్రవీణ్ వచ్చాడు.

"ప్రవీణ్! మనీషా లేకుండా నీతో మాట్లాడదామంటే అసలు కుదరడం లేదు. నేను ఒకటి అడుగుతాను. నువ్వు కాదనకూడదు. నాది అత్యాశేగానీ, నువ్వు తప్ప వేరెవరూ తీర్చలేరు.." అని మనోజ్ బతిమిలాడినట్లే ప్రవీణ్ చేయిని తన కుడిచేత్తో మెల్లగా నొక్కుతూ అడిగాడు.

"అదేంట్రా..! నువ్వు అడిగింది నేనెప్పుడైనా కాదన్నానా? మన మధ్య స్నేహం తెలిసే ఇలా అడుగుతున్నావా? నువ్వు అలా అన్నావంటే మన స్నేహానికే అవమానం. నువ్వు ఆదేశించు.. నేను చేయకపోతే అప్పుడు అడుగు..!" అన్నాడు ప్రవీణ్.

"అంత మాటన్నావు చాలురా.. నేను ఏది అడిగినా కాదనకూడదు!" అని ప్రవీణ్ దగ్గర మాట తీసుకున్నాడు మనోజ్.

రెండు నెలలుగా మనీషా ఎంత బతిమిలాడినా మనోజ్ సరిగా తినడం లేదు. అంతేకాదు సరిగా మాట్లాడడం లేదు కూడా.

అది ఎందుకో మనీషాకీ తెలుసు.

మనీషాని పెళ్లి చేసుకోమని మనోజ్ ఎంతగా అడిగినా ఆమె సానుకూలంగా స్పందించకపోవడమే.

అందుకే చివరకు మనీషా మనోజ్ చెప్పింది ఒప్పుకుంది. "మనూ! నువ్వలా పట్టుపడుతున్నావు కాబట్టి, నువ్వు చెప్పినట్లే పెళ్లి చేసుకుంటా.. బట్ ఒక కండిషన్. నేను చేసుకున్న వ్యక్తి కూడా మనతోనే.. మన ఇంట్లోనే ఉండాలి..!" అంది మనీషా కన్నీళ్లు కారుస్తూనే.

మనోజ్‌కు తను గాల్లో తేలినంత ఆనందం కలిగింది. మనీషాని దగ్గరకు పిలిచి, ఆమె నుదుటిపై ముద్దుపెట్టాడు. తన కుడిచేత్తోనే ఆమె కన్నీటిని తుడుస్తూ.. "థాంక్సు రా... బంగారం! మనీషా అంటే అర్థం ఏమిటో తెలుసా?" అన్నాడు. అతని ముఖంలో ఆనందం చూశాక, మనీషా కూడా అతని నుదిటిపై ముద్దుపెట్టి "ఏమిటి?" అని అడిగింది.

"మానవత్వం" అన్నాడు మనోజ్.

"అవునా..?!" అని అంటుంటే, "సరే.. ప్రవీణ్‌ను అర్జంటుగా రమ్మను" అన్నాడు మనోజ్.

"తనతో విషయం తర్వాత చెబుదాంలే.. ఇప్పటికిప్పుడు అర్జంటుగా ఎందుకు? ముందు అలాంటి వ్యక్తి మనకు దొరకాలి కదా!"



అంటూ చాలా ఈజీగా అనేసింది మనీషా.

• • •

"ఏంటి ప్రవీణ్ ఆలోచిస్తున్నావ్?" అంటూ మనోజ్ పిలవడంతో ఈ లోకంలోకి వచ్చాడు.

"ప్రవీణ్! పిల్లలు ముగ్గురూ రెడీ! ఇదిగో క్యారేజీలు.. వాళ్లని స్కూల్లో దింపేసి, మధ్యాహ్నం వచ్చేటప్పుడు ప్లే స్కూల్ నుండి చిన్నోడిని తీసుకొచ్చేయి. ఏడిస్తే నాకు కాల్ చేయమని చెప్పు. నేను వెళ్లి తెచ్చేసుకుంటాను" అంది మనీషా.

✦

కథలకు ఆహ్వానం

ప్రజాశక్తి ఆదివారం అనుబంధం స్నేహ కథలకు ఆహ్వానం పలకుతోంది. మంచి కథలను ఎంపిక చేసి ప్రచురిస్తాం. కథ సమకాలీన పరిణామాలు, పరిస్థితుల నేపథ్యంగా వుండాలి. ప్రపంచీకరణ నేపథ్యంలో వివిధ రంగాల్లో చోటు చేసుకున్న, చేసుకుంటున్న విపరిణామాలను కథాంశంగా తీసుకోవచ్చు. ప్రగతిశీల చైతన్యాన్ని, ఆత్మ విశ్వాసాన్ని పెంపొందించే కథలకు ప్రాధాన్యత. మూఢనమ్మకాలు పెంచేవిగా, ఏ సామాజిక తరగతిని ప్రత్యేకంగా నొప్పించేదిగా వుండకూడదు. మాండలికాలు ఉపయోగించినా కథన శైలి అందరికీ బోధ పడేలా వుండాలి. నవ్యత, వైవిధ్యం కలిగిన కథలకు ప్రత్యేక ఆహ్వానం.

నిబంధనలు

కథ నిడివి ప్రింటులో మూడు ఎ4 కాగితాల్లో వుండాలి. చేతిరాతలో అయితే 8 నుంచి 10 కాగితాల్లో వుండాలి. ప్రింటయినా, చేతిరాతైనా కాగితానికి ఒకవైపు మాత్రమే వుండేలా... జిరాక్స్ ప్రతిని పంపాలి. కథలను తిప్పి పంపడం వుండదు. పేరు, పూర్తి చిరునామా, ఫోన్ నెంబరు తప్పక రాయాలి. మా చిరునామా: స్నేహ, ప్రజాశక్తి దినపత్రిక, హౌస్ నెం. 27-30-4, ఆకుల వారి వీధి, గవర్నర్ పేట, విజయవాడ-2.

<u>మెయిల్ అడ్రస్:</u>

snehaweekly.praja@gmail.com

-ఎడిటర్

భూమికి గొడుగు



✧ 1995 నుంచి ఐక్యరాజ్యసమితి అంతర్జాతీయ ఓజోన్ పరిరక్షణ దినోత్సవాన్ని సెప్టెంబర్ 16న జరుపుకుంటోంది. 1987లో మాంట్రియల్ ప్రొటోకాల్ అదే తారీఖున జరిగింది.

✧ మూడు ఆక్సిజన్ అణువులుండే ఓజోన్ గాఢమైన వాసన కలిగిన నీలి రంగు వాయువు.

✧ 1840లో క్రిస్టియన్ ఫ్రెడెరిక్ స్కోన్‌బీన్ దీని జాడ ప్రపంచానికి తెలిపారు. వాసన అర్థాన్నిచ్చే గ్రీక్ పదం 'ఓజీన్' నుంచి పేరు పెట్టారు.

✧ భూమి ఉపరితలం పైభాగంలో 12-20 మైళ్ల పరిధిలో ఓజోన్ పొర ఉంటుంది.

✧ సూర్యుని అతినీలలోహిత (యూవీ) కిరణాలను 99 శాతం ఓజోన్ గ్రహించి జీవజాలాన్ని కాపాడుతోంది. అంటే మనం రాసుకునే సన్‌స్క్రీన్‌లా గొడుగులా భూమిని అది రక్షిస్తోంది.

✧ ఏసీలు, అగ్ని మాపకాలు, ఇన్సులేటింగ్ ఫోమ్ వాడకం వల్ల వెలువడే సీఎఫ్‌సీ తదితర రసాయనాలు వాతావరణంపైకి చేరి యూవీ కిరణాలతో చర్యజరిపి ఓజోన్‌ను ధ్వంసంచేస్తాయి. ఒక క్లోరిన్ లేదా బ్రోమిన్ అణువు కొన్ని వేల ఓజోన్ అణువుల్ని గొలుసుకట్టు చర్యలా విడగొట్టేస్తుంది.



✧ అదే లేకపోతే వివిధ క్యాన్సర్ల బారిన పడటమే కాకుండా వృక్ష, జంతు జాలం అంతరించిపోయి జీవ మనుగడకు పెను విఘాతం కలిగేది.





✧ 2000లో నాసా అతి భారీ ఓజోన్ చిల్లును అంటార్కిటికాపై గుర్తించింది. దాని పరిమాణం 2 కోట్ల 99 లక్షల చదరపు కిలోమీటర్లు. అంటే ఇంచుమించు ఆఫ్రికా ఖండమంత భారీ ప్రాంతం.

✧ ప్రస్తుతం ప్రపంచ దేశాలు తీసుకుంటున్న చర్యల ద్వారా ఓజోన్ నష్టం పూడటానికి ఇంకా 53 ఏళ్లు పడుతుంది.

✧ పారిశ్రామికంగా తయారుచేసే ఓజోన్‌ను స్విమ్మింగ్ పూల్ నీటిని శుభ్రపరిచేందుకు, డిసిన్ఫెక్టెంట్‌గానూ ఉపయోగిస్తారు.

✧ ట్రోపోస్పియర్‌లో ఉండే ఓజోన్ కన్నా 1000 రెట్లు స్ట్రాటోస్పియర్‌లో ఎక్కువ మందంగా ఉంటుంది.

✧ ట్రోపోస్పియర్ వద్ద ఓజోన్ ఎక్కువుంటే ప్రమాదం. ఊపిరితిత్తుల సమస్యలు, మొక్కల జీవ క్రియలకు నష్టం కలుగుతుంది.

✧ స్ట్రాటోస్పియర్‌లో ఎక్కువగా పొగు పడితే అతినీలలోహిత రేడియేషన్ ప్రభావం ఉండదు.

✧ యూవీ కిరణాలు ఆక్సిజన్‌ను రెండు అణువులుగా విడగొట్టడం వల్ల మరో ఆక్సిజన్ పరమాణువుకు అవి అతుక్కుని ఓజోన్ ఏర్పడుతుంది.

✧ 1985లో తొలిసారి అంటార్కిటికా పైభాగంలో ఓజోన్ పొరకు చిల్లు పడిందనే విషయాన్ని గుర్తించారు.

✧ సముద్ర మట్టం వద్ద గాలి ఒత్తిడి ద్వారా ఆ ప్రాంతంలో ఓజోన్ స్థాయిని గమనిస్తారు.

✧ మాంట్రియల్ ప్రొటోకాల్ ద్వారా ఓజోన్ హానికారక రసాయనాలపై నిషేధం విధించకుండా ఉంటే 2065 నాటికి భూమిపై జీవ మనుగడ అసాధ్యమయ్యేది. వాషింగ్టన్ డీ.సీ., దక్షిణ జర్మనీ వంటి ప్రాంతాల్లో యూవీ రేడియేషన్ స్థాయి 650 శాతానికి పెరిగిపోయేది. అంటే ఎండలో నిలుచుంటే కేవలం 5 నిమిషాల్లో చర్మం కాలిపోయేదన్న మాట.



మార్క్స్ 'ప్రేమ - పెట్టుబడి'

కార్ల్‌మార్క్స్ రచనలు ప్రపంచ రూపురేఖల్నే మార్చివేశాయి. పీడిత మానవాళి విముక్తికి కమ్యూనిస్టు విప్లవమే అనివార్యమని నిరూపించాయి. ఆయన వ్యక్తిగత జీవితం ఎంత విషాద భరితమో! గుండెలవిసే కష్టాలలో ఆయన వెన్నంటి వున్నది జీవన సహచరి జెన్నీ. అద్భుత సౌందర్యవతి. భర్తతోపాటు దుర్భర దారిద్ర్యం గడిపింది. అంతటి అపురూప దంపతులైన కార్ల్ మార్క్స్, జెన్నీల కుటుంబ జీవితాన్ని సాధికారికంగా చిత్రించిన తొలి పుస్తకం 'ప్రేమ-పెట్టుబడి'. మార్క్స్ 200వ జయంతిని (2018 మే 5) యావత్ ప్రపంచం జరుపుకోబోతున్న సందర్భంగా, ప్రజాశక్తి బుక్ హౌస్ తెలుగు పాఠకులకు ఈ గొప్ప గ్రంథాన్ని అందిస్తోంది. ఈ అమూల్య రచనలోని కొంత భాగం ఆదివారం అనుబంధం 'స్నేహ'లో ఏడాదిపాటు సీరియల్‌గా వచ్చిన విషయం పాఠకులకు విదితమే.



'ప్రేమ - పెట్టుబడి', కార్ల్-జెన్నీ మార్క్స్,
విప్లవం చిగురించిన వేళ,
రచయిత - మేరీ గేబ్రియేల్,
సంక్షిప్తానువాదం: ముక్తవరం పార్థసారథి
సంపాదకత్వం: ఫాతిమా,
వెల: రు.350/-, **పేజీలు:** 560
ప్రతులకు: ప్రజాశక్తి బుక్‌హౌస్,
27-1-64, కార్ల్‌మార్క్స్ రోడ్, గవర్నర్‌పేట,
విజయవాడ, 520002.
ఫోన్: 0866- 2577533

ఇది వాళ్ల ప్రేమ కథ. రచనల కారణంగా యూరోప్‌లో దేశ బహిష్కరణలకు గురై ఎక్కడా తలదాచుకోవటానికి చోటులేక లండన్‌కు చేరుకొని తన విప్లవకార్యాచరణ కొనసాగించాడు మార్క్స్. అయితే ఆయన జీవితమంతా కేవలం రాజకీయాలు, ఆర్థిక, తాత్విక విషయాలు మాత్రమే కాదు, కుటుంబాన్ని అపురూపంగా చూసుకున్న ఇంటి యజమానిగా, ప్రేమించే భర్తగా, పిల్లలకు తండ్రిగా ఆయనలోని మరో కోణాన్ని, హాస్యచతురతను మనకు పరిచయం చేస్తుందీ కథనం. ఇప్పటికీ లభ్యం కాని సమాచారం సేకరించి, "మార్క్స్‌కు మరోవైపు"ను ఆవిష్కరించిన దాంపత్య గాథ. ట్రీయర్ నగరంలో ప్రారంభమై ప్యారిస్, బ్రాస్సెల్స్, బెర్లిన్ వంటి అనేక నగరాలను చుట్టి లండన్‌లో ముగుస్తుంది.

లింగ వివక్షపై అక్షర సమరం

పితృస్వామ్యం, పురుషాధిక్యత, స్త్రీ-పురుష అసమానత.... అంటే ఏమిటో ఎవరికీ విడమర్చి చెప్పాల్సిన పనిలేదు. నాగరికత పెరిగే క్రమంలో ఉత్పత్తి సాధకులుగా ఉన్న అసంఖ్యాకమైన ప్రజల్ని పరాన్నజీవులు తమ గుప్పెట్లో పెట్టుకోవడానికి ఏర్పాటు చేసిన వర్ణవ్యవస్థలో కూడా మహిళల మనుగడకు ఎలాంటి విముక్తి లేకపోయింది. ఆధునిక సమాజంలో అక్కడక్కడా మహిళలు ముందంజ వేస్తున్నా వారికి ప్రతిబంధకాలు సృష్టిస్తున్నవారే ఎక్కువయ్యారు. ఇవే అంశాలను 'సమతావని'లో చర్చించారు. నిజానికి ఈ నవల మూడు దశాబ్దాల కిందటే 'ప్రమదావని' పేరుతో ఒక పత్రికా నవలగా పాఠకులను అలరించింది. స్త్రీవాదం మొదలైన తొలినాళ్లలోనే వెలువడిన ఈ నవల ఎన్నో అంశాలను చర్చకుపెట్టింది. ఈ నవలలో ప్రధాన పాత్ర 'ఆనంద్'. సమాజం పురుషాధిక్యత నుంచి మహిళల ఆధిక్యతలోకి మారితే ఎలా ఉంటుందో వివరించడమే ఈ నవల ఇతివృత్తం. అయితే ఇదే కథావస్తువుతో



సమతావని(నవల)
రచయిత: ఫెమినిస్ట్ ప్రసాద్
పేజీలు: 144
ధర: రూ.80/-
లభించు చోట్లు:
ప్రజాశక్తి, విశాలాంధ్ర పుస్తక కేంద్రాలు

'జంబలకిడిపంబ' అనే సినిమా కూడా వచ్చింది. కానీ అది మహిళలను అవహేళన చేసి, స్త్రీ-పురుష సంబంధాలను వ్యంగ్యంగా చిత్రీకరించి వెకిలి హాస్యాన్ని సొమ్ము చేసుకోవాలని వచ్చింది. అయితే ఈ నవలలో ఉన్న పాత్రలను నడిపిన తీరు అందుకు పూర్తి విభిన్నంగా ఉంటుంది.
ఇది కాల్పనిక నవలే అయినప్పటికీ వాస్తవ అంశాలను పాఠకుల కళ్లముందు ఉంచుతుంది. వారిని కాసేపైనా మనుషులుగా ఆలోచింపజేస్తుంది. స్త్రీ-పురుష సమానత్వం కోసం రచయిత తపన ఈ నవలలోని అక్షరాల్లో అడుగడుగునా కన్పిస్తుంది. మహిళల అణిచివేత గుట్టువిప్పి చెప్పిన ఈ నవలలో ఎన్నో అణిముత్యాల్లాంటి మంచిమాటలున్నాయి. వర్తమాన సామాజిక అవసరాల కోసం ఈ నవల క్రమపద్ధతిలో చర్చించినా ఎక్కడా సాహిత్య విలువలకు భంగం కలగకుండా మంచి శైలిలో కథను నడిపిస్తుంది. ప్రపంచీకరణ నేపథ్యంలో దాని అవలక్షణాలకు స్త్రీ-పురుష సంబంధాలు కూడా ప్రభావితమౌతున్న వేళ ఈ నవలను పాఠకులు ఆదరిస్తారు. ఇందులోని అంశాలపై చర్చించడం ద్వారా సాహితీప్రియులు, లింగ వివక్షపై పోరాడుతున్న సంస్థలు మరింత ముందుకు వెళ్లడానికి వీలౌతుంది. అందువల్ల రచయిత ఈ నవలను తాజాగా ప్రచురించడం అభినందనీయమనే చెప్పాలి.

- బెందాళం కృష్ణారావు

మిర్చి కుర్మా

కావాల్సిన పదార్థాలు

మాంసం-1 కెజి
ఎండు మిర్చి-10 (విత్తనాలు తీసినవి)
ఉల్లిపాయలు-3 (సన్నగా కట్ చేసుకోవాలి)
దాల్చిన చెక్క-2
లవంగాలు-2
అల్లం వెల్లుల్లి పేస్ట్-1 టేబుల్ స్పూన్
జీలకర్ర-1 టేబుల్ స్పూన్
మీట్ మసాల-1 టేబుల్ స్పూన్
సోంపు పొడి-1టేబుల్ స్పూన్
ఉప్పు-చిటికెడు
నూనె-సరిపడ

తయారు చేసే విధానం

ముందుగా పాన్ లో కొద్దిగా నూనె వేసి వేడి చేయాలి. తర్వాత అందులో సన్నగా తరిగిపెట్టుకున్న ఉల్లిపాయ ముక్కలు వేసి గోధుమ రంగు వచ్చే వరకు వేయించుకోవాలి. అందులో మటన్ వేసి కొద్ది సేపు వేయించిన తర్వాత దాల్చిన చెక్క , లవంగాలు, యాలకులు, సోంపు పొడి, జీలకర్ర, మీట్ మసాల పొడి, వేసి బాగా కలిపి మరికొంతసేపు వేయించాలి. ఇప్పుడు అందులో కొద్దిగా నీరు పోసి 15 నిమిషాల పాటు ఉడికించుకోవాలి. ఈ మొత్తం మిశ్రమాన్ని ఒక పాత్రలోకి తీసి కుక్కర్‌లో ఉంచి రెండు విజిల్స్ వచ్చే వరకు ఉడికించుకోవాలి. తర్వాత ఒక బౌల్‌లో ఎండు మిర్చి వేసి కొద్దిగా నీళ్లు పోసి మెత్తబడే వరకూ ఉడికించాలి. నీరు వంపేసి మిక్సీ జార్‌లో వేసి పేస్ట్ చేసుకోవాలి. ఇప్పుడు స్టౌపై ఒక గిన్నె ఉంచి అందులో చింతపండు పేస్ట్, ఎండుమిర్చి పేస్ట్, కుక్కర్‌లో ఉడికించుకున్న మిశ్రమాన్ని వేసి మరో 5 నిముషాలు ఉడికించి దించేయాలి. చివరిగా కొత్తిమీర తరుగుతో గార్నిష్ చేసి వేడి వేడిగా సర్వ్ చేయాలి.



ముర్గ్ ధనియా కుర్మా

కావాల్సిన పదార్థాలు

చికెన్-1 కెజి
కొత్తిమీర తరుగు- 2 కప్పులు
మసాల-2 టీస్పూన్లు
అల్లం-1టేబుల్ స్పూన్
వెల్లుల్లి తరుగు-1 టేబుల్ స్పూన్
పచ్చిమిర్చి తరుగు-2 టేబుల్ స్పూన్లు
ఉల్లిపాయ ముక్కలు-1/2 కప్పు
మిరియాల పొడి-1 టేబుల్ స్పూన్
ఉప్పు- చిటికెడు
పసుపు- 1టేబుల్ స్పూన్
పెరుగు- 1కప్పు
నూనె-1 కప్పు



తయారుచేసే విధానం

ముందుగా పాన్‌లో కొద్దిగా నూనె వేసి వేడి చేయాలి. తర్వాత అందులో ఉల్లిపాయ ముక్కలు వేసి గోధుమ రంగు వచ్చే వరకు వేయించుకోవాలి. ఒక ప్లేట్‌లో వేయించిన కొన్ని ఉల్లిపాయ ముక్కల్ని తీసి పక్కన పెట్టుకోవాలి. ఇప్పుడు పాన్‌లో మరికొంచెం నూనె వేసి చికెన్ ముక్కల్ని వేయించుకోవాలి. అందులో పసుపు, ఉప్పు, అల్లం, వెల్లుల్లి తరుగు కూడా వేసి వేయించాలి. చికెన్ నుండి నూనెపైకి తేలే వరకూ వేయించి మసాల, పచ్చిమిర్చి, పరుగు, వేయించి పెట్టుకున్న ఉల్లిపాయ ముక్కలు, వేసి గ్రేవీ చిక్కబడే వరకు ఉడికించాలి. అందులో మిరియాల పొడి, కొత్తి మీర తరుగు వేసి వేసి కలిపి మరో పది నిమిషాల పాటు ఉడికించుకోవాలి. తర్వాత స్టౌ ఆఫ్ వేడి వేడి అన్నంతో ముర్గ్ ధనియా కుర్మాని సర్వ్‌చేయండి.

మటన్ దమ్ పక్త్

కావాల్సిన పదార్థాలు

మటన్-1 కెజి
ఉల్లిపాయలు-2 (సన్నగా కట్ చేసుకోవాలి)
వెల్లుల్లి రేకలు-5 (కట్ చేసుకోవాలి)
అల్లం- చిన్న ముక్క
యాలకులు- 4
నల్ల మిరియాలు-6
లవంగాలు-4
జీలకర్ర-1 టేబుల్ స్పూన్
పెరుగు- 1కప్పు
పచ్చిమిరపకాయలు-4
పుదీనా ఆకులు- 1/2 కప్పు (సన్నగా కట్ చేసుకోవాలి)
కొత్తిమీర-1/2 కప్పు (సన్నగా కట్ చేసుకోవాలి)
గోధుమ పిండి-1 కప్పు
ఉప్పు- చిటికెడు
నూనె-తగినంత
నీరు- సరిపడ

తయారుచేసే విధానం

ముందుగా మటన్‌ను శుభ్రంగా కడిగి పక్కన పెట్టుకోవాలి. తర్వాత స్టౌపై ఒక పాత్ర పెట్టి అందులో పుదీనా, కొత్తిమీర, ఏలకులు, లవంగాలు, జీలకర్ర, మిరియాలు, కొద్దిగా నీరు పోసి పేస్ట్‌లా తయారు చేసుకోవాలి. మిక్సీ జార్‌లో శుభ్రం చేసి పెట్టుకున్న మటన్ ముక్కలు, కొత్తిమీర పేస్ట్ వేసి మెత్తగా బ్లెండ్ చేసి పక్కన పెట్టుకోవాలి. రెండు గంటల తర్వాత డీప్ బాటమ్ పాన్‌లో నూనె వేసి వేడయ్యాక అందులో ఉల్లిపాయ ముక్కలు వేసి వేయించుకోవాలి. అందులో అల్లం, వెల్లుల్లి, పచ్చిమిర్చి ముక్కల్ని కూడా వేసి మరో రెండు నిమిషాలు వేయించుకోవాలి. ఇప్పుడు అందులో పేస్ట్ చేసుకున్న మటన్ ముక్కల మిశ్రమాన్ని వేసి బాగా కలుపుతూ రెండు నిమిషాలపాటు వేయించాలి. అందులో ఒక కప్పు నీరు పోసి బాగా కలపాలి. మసాల, నీరు బాగా కలిపి మూత పెట్టాలి. ఒక బౌల్‌లో గోధుమ పిండి తీసుకుని మెత్తగా కలుపుకొని పాన్ అంచులకు మూతకు అంటించాలి. లోపలి ఆవిరి బైటికి రాకుండా ఇలా పూర్తిగా పాన్ చుట్టూ అతికించాలి. తక్కువ మంటపై 40నిమిషాల పాటు ఆవిరిలోనే ఉడికించాలి. ఇప్పుడు స్టౌ ఆఫ్ చేసి ఆవిరి పూర్తిగా తగ్గేవరకు చాపాతీ సీల్ తియ్యకుండా ఉంచాలి. తర్వాత ఈ మిశ్రమాన్ని ఒక బౌల్‌లోకి తీస్తే దమ్ పక్త్ రెడీ.



బాల నేస్తాలు



ఏ నీడ?

ఇక్కడ ఒక చేపపిల్లలతో పాటు కొన్ని నీడల్ని ఉంచాం. దానికి సరైన నీడ ఎక్కడుందో గుర్తించి జతచేయండి.

చుక్కలు కలపండి

లెక్కించండి

ఇక్కడ కొన్ని వృత్తాల్లో అంకెలనుంచాం అయితే ఒక్కో చోట అంకెలు మిస్సయ్యాయి. అవేంటో కనిపెట్టి అక్కడ రాసేయండి !



Answer:



నీడతో బొమ్మ

లిటిల్ స్టార్

హాయ్ ఫ్రెండ్స్ నేనో టాలీవుడ్ స్టార్‌ని! ఇది నా చిన్ననాటి ఫోటో ఇంతకీ నేనెవరో చెప్పండి?

కనిపెట్టండి

చింటు వాళ్ల ఇంటి ముందున్న గార్డెన్‌లో ఒక కుందేలు పిల్ల దూరి తెగ అల్లరి చేస్తోంది. ఆ గార్డెన్‌లో దానికి ఇష్టమైన క్యారెట్‌తో పాటు మరికొన్ని కూరగాయలు దాగున్నాయి. కింద ఇచ్చిన బొమ్మల ఆధారంగా అవెక్కడున్నాయో కనిపెట్టండి.



నేర్చుకుందాం

పిల్లలూ! మీకు బొమ్మలు గీయడమంటే ఎంతో ఇష్టం కదూ! మీ కోసం ఆర్టిస్ట్ అంకుల్ బుజ్జి పెంగ్విన్ బొమ్మని ముందుగా సగం గీసుంచాడు. మీరు మిగిలిన భాగాన్ని జాగ్రత్తగా పూర్తిచేయండే!



నాలుగేళ్లు....మూడు రికార్డులు



మూడు నాలుగేళ్ల వయసు పిల్లల్లో ముద్దు మాటలతో రైమ్స్ చెప్పే వారు కొందరైతే స్కూల్‌కి వెళ్లనంటూ పేచీపెడుతుండే పిల్లలు మరికొంతమంది. పలకపై అక్షరాల్ని దిద్దే ఈ వయసులో స్పష్టంగా పదాలని పలకటం, అంకెల్ని గుర్తుపెట్టుకొని వరుసగా చెప్పటం చాలా కష్టం. అయితే ఇవన్నీ తేలిగ్గా చెప్పేస్తుంటాడు నాగ్‌పూర్‌కి చెందిన మల్‌ఖన్దేల్. నర్సరీలో పిల్లలందరూ అక్షరాలతో కుస్తీపడుతుంటే మల్‌ఖన్దేల్ మాత్రం ప్రపంచ రికార్డులతో ముందుకు సాగుతున్నాడు. ఒక నిమిషంలో సాధారణంగా పిల్లలు ఓ పది పదాల్ని వేగంగా పలకగలరు కానీ ఈ చిచ్చర పిడుగు మాత్రం నిమిషానికి 41 పదాలు పలుకుతాడు. ఐదు నిమిషాల్లో 160 పదాలు పలికి ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు దక్కించుకున్నాడు.

100 నుండి 0 వరకు అంకెలన్నిటినీ రివర్స్‌లో చెప్పి ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్ నిర్వహించిన మరో పోటీలోనూ ప్రథమ స్థానంలో నిలిచాడు. పదాలు అంకెలు, రైమ్స్ విభాగాల్లో నిర్వహించే పోటీలే కాదు రకరకాల కార్లను కూడా తేలిగ్గా గుర్తుపట్టేస్తాడు. ఏదైనా కార్ బొమ్మని స్క్రీన్ పై చూపిస్తే చాలు దాని పేరుతో పాటు ఏ కంపెనీకి చెందిందో కూడా చెప్పేయగలడు. నిమిషంలో 51 మోడళ్ల కార్లను గుర్తించి మరో రికార్డును సొంతం చేసుకున్నాడు మల్‌ఖండేల్. తల్లిదండ్రుల ప్రోత్సాహంతో ఇప్పుడు మరారిలో కష్టమైన పదాల్ని పలకడంలో సాధన చేస్తున్నాడు. ఎందు కంటే తను తర్వాత పోటీ పడబోయే విభాగం అదే అని మీకిప్పటికే అర్థమై ఉంటుంది మరి. ✦

పదవికాసం - 29

కూర్పు: రావెళ్ల

1	■	2	3	■	4		■	5
6	7	■		■		■	8	
■	9	10		■	11	12		■
13	■		■	14	■		■	15
16		■	17			■	18	
	■	19	■		■	20	■	
■	21		22	■	23		24	■
25		■		■		■	26	27
	■	28		■	29		■	

ఆధారాలు

అడ్డం

2. కుడి నుంచి సర్వం (2)
4. మహా ప్రస్థానం రచయిత (2)
6. రంకె, పువ్వులలో చివరి అక్షరాలు (2)
8. విత్తనం (2)
9. కన్ను (3)
11. క్రూరమైన స్వభావం కలవాడు (3)
16. నందివర్ధనంలో తొలి సగం (2)
17. సంఘర్షణ (3)
18. రోడ్డు వేయడానికి వాడే నల్లని జిగురు (2)
21. వార్తలు తెలిపేది (3)
23. సుగంధ ద్రవ్యము (3)
25. పద్యంకాదు వచనం (2)
26. శవాన్ని కాల్చేందుకు పేర్చిన కట్టెలు (2)

నిలువు

1. సంఖ్య కాదు (2)
3. పవిత్రం చేయడం (3)
4. తెలుగు సంవత్సరాలలో ఏడవది (3)
5. యదార్థం (2)
7. హాసం ఎదురు తిరిగింది (2)
8. పంటలు పండని భూమి (2)
10. ఒక ధాన్యపు గింజ (2)
12. 'లుబ్ధకుడు'లో తొలిసగం (2)
13. వినమని చెప్పండి (3)
15. మేఘాలుచేసే శబ్దం (3)
19. ఆకు (2)
20. తండ్రి సోదరి ఏమవుతుంది (2)
21. గణాలు, పాదాల కూర్పు కలిగిన (2)
22. చిలుం పట్టకుండా పాత్రల లోపల పూసేది(3)
23. బురద (3)
24. పదార్థం నోటికి తగలగానే తెలిసేది (2)
25. పశువుల తిండి (2)
27. నింద (2)

సుడోకు

5	6		2	8		9		1
			5		4	3		
			7	1			2	8
4					5		1	
2	5			7			8	3
	8		3					6
6	9			2	7			
		8	1		9			
7		5		3	8		9	2

గతవారం జవాబులు

1	7	6	2	8	5	4	3	9
4	3	5	7	9	6	8	1	2
2	8	9	3	4	1	5	6	7
6	5	8	9	1	2	7	4	3
3	9	4	6	5	7	1	2	8
7	1	2	8	3	4	6	9	5
8	6	7	4	2	3	9	5	1
9	2	1	5	6	8	3	7	4
5	4	3	1	7	9	2	8	6

■	1 స్పి	2 క	ర్	■	3 శ	4 ర	త్	■
5 ప్ర	■	ల	■	6 ప	■	క్షం	■	■
7 తి	ట్టు	■	8 ప్ర	సం	గం	■	9 ఆ	10 శ
ష్టా	■	11 స	■	దు	■	12 ఆ	■	కుం
13 స	ల్ల	బ	ల్లి	■	14 ప్ర	మో	దూ	త
పు	■	ల	■	15 ఘుం	■	దం	■	లా
16 రం	కె	■	17 హం	గా	మా	■	18 ప	దే
■	■	19 మే	■	లు	■	20 ఆ	■	వి
■	21 న్యూ	ట	న్	■	22 పి	చ్చు	క	■

మిస్సింగ్ నంబర్

పక్క వృత్తంలో మిస్సయిన అంకె గుర్తించండి.

4 3 2
5 3 5 1 1
6 1 2 8 3 3 1
7 2 8 4 3
9 ? 3

మచలీ
రణతంబోర్ రాణి

'మచలీ: మొసళ్లను వేటాడిన ఆడపులి' 'ది టైగర్ క్వీన్' ఓ ఆడపులికి ఇన్ని బిరుదులా! రాజస్థాన్ రణ్‌తంబోర్ కోట చుట్టు పక్కల కొన్ని సరస్సుల్లో మొసళ్లు మిగతా జంతువులకు నీటి మీద ఆస్కారమిచ్చేవి కాదు. అలాంటిది 14 అడుగుల పొడవున్న మొసలిని వేటాడుతూ కెమెరా కంటికి చిక్కినప్పటి నుంచి మచలీ వైల్డ్ లైఫ్ ఫొటోగ్రాఫర్లకు ఫేవరెట్ అయిపోయింది. అప్పటివరకు అలాంటి పులి పోరాటం రికార్డులకెక్కింది లేదు. 'ది మోస్ట్ ఫొటోగ్రాఫ్‌డ్ టైగ్రెస్'గా రికార్డు మచలీది. ఈ ఆడ పులికి మచలీ అని పేరెలా వచ్చిందంటే దాని ముఖం ఎడమ భాగంపై చేపను పోలిన రెండు మచ్చలుంటాయి. కొన్ని వందల డ్యాకుమెంటరీల్లో, కొన్ని వేల ఛాయాచిత్రాల్లో సజీవంగా నిలిచిపోయిన ఖ్యాతి దానిది. ఈమధ్యే 20 ఏళ్ల వయస్సులో అది చనిపోయింది. ప్రభుత్వ లాంఛనాలతో దాని అంత్యక్రియలు చేశారు. దేశ, విదేశీ పర్యాటకుల్ని, పరిశోధకుల్ని రప్పించింది దీని ఠీవి. రాజస్థాన్ పర్యాటకానికి ముఖచిత్రంగాను మచలీకున్నా పేరు పనిచేసింది. ఎక్కువగా సరస్సుల వద్ద కనిపించే మచలీకి 'లేడీ ఆఫ్ ది లేక్' అనే పిలుపు కూడా ఉంది. పులుల సంఖ్య వృద్ధి చెందడానికి పర్యావరణ, జీవ సమతుల్యంలో కూడా మచలీది ముఖ్యపాత్రే. 1997 జూన్‌లో తన తల్లి మచలీ-1కు పుట్టిన ఈ ఆడపులికి కోడ్ భాషలో టి-16 అని పేరు పెట్టారు. బాంబూ రామ్ (1997), నిక్ ఇయర్ (2002), ఎక్స్ మేల్ (2004) అనే మగ పులుల ద్వారా 4 మగ, 7 ఆడ పులి పిల్లలకు జన్మనిచ్చింది. కన్నబిడ్డల్ని మగ పులుల నుంచి మిగతా అడవి జంతువుల నుంచి కాపాడుకోవడంలో మచలీది మించిన గొప్ప కథ లేదు. మచలీ తెగువకు మగ పులులు తోక ముడిచి టెరిటరీలను వదిలి పారిపోయేవి.



గుహా నగరం



జోర్డాన్ ఎడారి నేలల్లో లేత గులాబీ వన్నె కొండల్లో తొలచిన కళాత్మక నగరం పెట్రా. మన సినిమా పాటల్లో, హాలీవుడ్ సినిమా సన్నివేశాల్లో కనిపించే రాతి పట్టణమిది. రక్మూ అసలు పేరైన వేల ఏళ్ల నాటి ఈ ఎడారి నగరం చారిత్రాత్మకమైనది, ఆలోచనకందని విస్మయకరమైనది. ఇసుకరాతి కొండలపై రహస్య మార్గాల్లో రాతిని తొలచి చెక్కిన ఈ నగర నిర్మాణం మనిషి మనుగడ కథకు సరికొత్త మలుపు. చెమట కూడా ఆవిరయ్యే అతి ఉష్ణ ప్రాంతంలో నిండు ఎడారిలో క్రీపూ. 2150 నాటికే అత్యంత సౌందర్యంతో గుహావాసాల్ని కొలువు తీర్చారు నెబానితేనియన్లు. అరబ్బుల ముందటివారైన వీరు అలాంటి ప్రాంతంలో నీటిని ఒడిసిపట్టే సాంకేతికతను అభివృద్ధి చేసుకున్నారు. ఇనుముతో పరికరాలు తయారుచేశారు. అదే కీలకమై వాణిజ్య మార్గాలపై అదుపు వచ్చింది. డమాస్కస్ నుంచి అరేబియా ప్రాంతం వరకు ఆధిపత్యాన్ని అందించింది. అంతెత్తుండే ప్రార్థనా మందిరం, వరస గుహ సమాధులు, వేలాది మంది కూర్చోగలిగే యాంపీ థియేటర్, సొరంగ మార్గాల్లో ధనాగారాలు, ధాన్యాగారాలు, పట్టణ నిర్మాణాలు ఇలా ఎన్నో చారిత్రక కట్టడాలున్నాయి. ఈ ప్రాంతంలో ఇంకా వెలుగులోకి రాని ఎన్నో నిర్మాణాలున్నాయని పరిశోధకులు భావిస్తున్నారు. ఈమధ్యే ఆల్-డైర్ కట్టడానికి దూరంగా అంతకంటే మరో భారీ సైట్‌ను పురావస్తు పరిశోధకులు కనుగొన్నారు.